సప్తమి పర్వదినం ప్రత్యేక పల్లకి సేవ స్వామివారికి పంచామృతాలతో అభిషేకం

ఆదిత్య హృదయం పారయణం
ముడుపు సమర్పణ ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ



జగిత్యాల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)
భానువాసరే ఆశ్వీయుజ మాసం శుక్ల పక్షం సప్తమి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు
సూర్య భగవానుని విశిష్టత
ఆదివారం సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యం ఆయుష్మానుభవం విజయం ధనం ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది తదియపర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ సూర్య భగవానుకి పంచామృతాలతో అభిషేకాలు సామూహిక ఆదిత్య హృదయం పారయాణం అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు అనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేపట్టారు అనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు ఈ కార్యక్రమమం లో ఫౌండర్ అండ్ చైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్ సహాయ కోశాధికారి గోప-స్వాతి భారతాల రాజసాగర్ ప్రవీణ్ కుమార్ చైతన్య లక్ష్మినారాయణ జ్యోతి హరీష్ రవీందర్ యాంసాని శంకరయ్య రాజేందర్ మల్లేశం.అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు




వైభవంగా గాలి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజలు.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు.. అన్నప్రసాద వితరణ
నంగారెడ్డి, వుదయం:
సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట గాలి పోచమ్మ నగర్‌లో కొలువైన గాలి పోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిపారు.రాజంపేట శ్రీ రాజరాజేశ్వర ఆలయ అర్చకులు రాజేశ్వర్ ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ నిర్వహించారు. అనంతరం గాలి పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేసి హారతి సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక రాజంపేట పెద్దలు, కౌన్సిలర్ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ దిడ్డి విట్టల్, అల్లూరి లక్ష్మణ్, టేకుల అశోక్, కృష్ణ, గంగా మోహన్, కుంటల సత్యనారాయణ, విట్టల్ రెడ్డి, టేకుల భూపాల్, పూజారి ప్రభాకర్, సుప్పల శ్రీనివాస్, శ్రీధర్, మహేంద్ర, సదానందం, ప్రభు, మల్కాగౌడ్, జయరాం, శివకుమార్, తాండ్ర రాజు, శ్రీకాంత్, సత్యనారాయణ, భాను ప్రకాష్ రెడ్డి, మున్వార్, షాకీర్, పాషా, మోహిద్దీన్, మహిళా సంఘం

ఉజ్జయిని జగద్గురువులకు ఘనంగా లక్ష బిల్వార్చన

వీరశైవ లింగాయత్ జిల్లా సమాజం పెద్ద ఎత్తున హాజరు.




జహీరాబాద్ వుదయం : కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని సద్గురు సింహాసన మహాసంస్థాన పీఠాధిపతులు, శ్రీమద్ ఉజ్జయిని సద్గురు పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య భగవత్పాద మహాస్వాముల వారికి లక్ష బిల్వార్చన మహోత్సవాన్ని ఆదివారం జహీరాబాద్‌లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు, పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు ఇప్ప నర్సింలు మాట్లాడుతూ.. జగద్గురువుల దివ్య ఆశీస్సులు పొందే పవిత్ర కార్యక్రమంలో సమాజ బంధువులందరూ భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. జగద్గురువుల ఆశీస్సులు అందరూ పొందాలని ఆకాంక్షించారు. భక్తుల సమక్షంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

ధన్వాడలో గణపతి సచ్చిదానంద స్వామికి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు



ధన్వాడ, (మంథని నియోజకవర్గం): ఆధ్యాత్మిక పరవచకులు, అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదివారం నాడు భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ధన్వాడ గ్రామానికి విచ్చేయనున్నారు. ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో బయలుదేరి 10 గంటలకు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వగ్రామం ధన్వాడకు చేరుకుంటారు. లోక కళ్యాణార్థం ఇక్కడి దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. అనంతరం భక్తులను దివ్య భాషణం ఇస్తారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా మంథనికి బయలుదేరి వెళ్తారు. అక్కడి శివకిరణ్ గార్డెన్స్ లో మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గం తో పాటు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసే భక్తులకు దర్శనమిస్తారు. వారి నుద్దేశించి ప్రసంగిస్తారు. కార్యక్రమాల్లో స్థానిక ఆధ్యాత్మిక వేత్తలు, రాజకీయ ప్రముఖులు పాల్గొంటారు.



పి.టి. స్వామి సంస్మరణ సభలో దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, (గోదావరిఖని) నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)
ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి.టి. స్వామి సంస్మరణ సభ ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా పి.టి. స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన పార్టీకి అందించిన సేవలను, ప్రజా సమస్యలపై చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. పి.టి. స్వామి మరణం బీఆర్ఎస్ పార్టీకి, ఆయనను అభిమానించే కార్యకర్తలకు తీరని లోటని పేర్కొన్నారు.



అనంతరం దాసరి మనోహర్ రెడ్డి పి.టి. స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పి.టి. స్వామి కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

పెద్దపల్లిలో మాజీ మంత్రి హరీష్ రావుకు ఘన స్వాగతం

పెద్దపల్లి, నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)
బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు గారికి ఆదివారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.
బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హరీష్ రావు గారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.
అనంతరం హరీష్ రావు గారు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను



అడిగి తెలుసుకున్నారు. ఆయనను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా అభివాదం తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) భారతదేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ అన్నారు ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంతతో కలిసి తిరుమల గంగాధర్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు భారతదేశ అభివృద్ధి పేదల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణ నియమని అన్నారు దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దృఢమైన నాయకత్వాన్ని అందించారని బ్యాంకుల జాతీయికరణ రాజభరణాల రద్దు వంటి కీలక నిర్ణయాలతో సామాజిక ఆర్థిక మార్పులకు బాటలు వేశారని గుర్తు చేశారు పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆమె ఇచ్చిన గరీబీ హటావో నినాదం ప్రజల్లో ఆశలు నింపిందన్నారు దేశ ఐక్యత సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు



తీసుకెళ్లడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆమె స్ఫూర్తితో ప్రజా సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం వెంకటేశ్వర దేవాలయ చైర్మెన్ ఏతిరాజం నర్సయ్య కౌన్సిలర్ తోట గంగాధర్ నాయకులు ఏడ్ల రమేష్ మేడిపల్లి శేఖర్ రెడ్డి తెడ్డు విజయ్ మ్యాకల నర్సయ్య ఏంబేరి సత్యనారాయణ వెంకటేష్ గోడికే రాజ్ కిషన్ ఇల్లెందుల శ్రీధర్ మాజీ కౌన్సిలర్ రియాజ్ పండిత్ రాజేశ్వర్ పెరుమాండ్ల సత్యనారాయణ మాసపురం వెంకన్న కీసర అశోక్ రాకేష్ దర్శనం రాజు ఎడ్ల గణేష్ ప్రశాంత్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

నంగా మాజీ ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన వేడుకలు



నంగారెడ్డి ,వుదయం
మాజీ ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు ఇప్పపల్లి నరసింహులు కార్యక్రమంలో పాల్గొని బీబీ పాటిల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీ కేతిక సంగమేశ్వర ఆలయ చైర్మన్‌గా రెండోసారి ఎన్నికైన మల్కాపురం చంద్రశేఖర్‌కు ఘన సన్మానం



జహీరాబాద్ వుదయం : జరా సంఘంలోని శ్రీ కేతిక సంగమేశ్వర ఆలయ చైర్మన్‌గా రెండోసారి ఎన్నికైన మల్కాపురం చంద్రశేఖర్‌ను సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సలహాదారులు అన్నిశెట్టి జయప్రకాశ్, కంది మాజీ సర్పంచ్ బుగ్గనగారి వీరేశం, జిల్లా యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, జహీరాబాద్ తాలూకా యువజన అధ్యక్షులు అరుణ్ కుమార్, అనురుద్ రెడ్డి, తదితరులు చంద్రశేఖర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
రెండోసారి ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ఆలయ అభివృద్ధికి మరియు భక్తులకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

పౌర హక్కులు ప్రతి ఒక్కరికీ సమానమే

కోరుట్ల మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య

వెంకటాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ



కోరుట్ల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి) పౌర హక్కులు ప్రతి ఒక్కరికీ సమానమని భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) కృష్ణ చైతన్య అన్నారు కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ గ్రామ గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని కులం మతం ప్రాంతం ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సమాన గౌరవం హక్కులు ఉంటాయని తెలిపారు పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎక్కడైనా హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి న్యాయం పొందాలని సూచించారు గ్రామ స్థాయిలో సామాజిక సమానత్వం సోదరభావం ఐక్యతను పెంపొందించుకోవాలని కోరారు అనంతరం గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు కులమత భేదాలు లేకుండా గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో మెలగాలని రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవిస్తూ ఇతరుల హక్కులకు కూడా భంగం కలగకుండా వ్యవహరించాలని కోరారు గ్రామంలో అంటరానితనం వివక్ష వంటి సామాజిక దురాచారాలకు తావులేకుండా ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్ రావు ఉపసర్పంచ్ పిట్టల రాజేశ్వరి సెక్రటరీ శ్రీనివాస్ జిపిఓ రమ్యశ్రీ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

మిల్లింగ్ మాయాజాలం.. ముడుపుల ఆరోపణల కలకలం!

గద్వాల సివిల్ సప్లైస్‌లో అక్రమాలపై అనుమానాలు.. తనిఖీలు చేయకుండానే సంతకాలా?
రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై ప్రచారం.. విజిలెన్స్ విచారణకు ప్రజల డిమాండ్



గద్వాల నవంబర్ 01 (వుదయం బ్యూరో)
జిల్లా పౌరసరఫరాల శాఖలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, ప్రభుత్వానికి బియ్యం అప్పగింతల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కొందరు అధికారులు, రైస్ మిల్లర్ల మధ్య అనధికారిక అవగాహన ఉందన్న ప్రచారం వినిపిస్తుండటంతో శాఖ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మిల్లుల వద్ద తనిఖీలు ఎక్కడ? ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, బియ్యం ఉత్పత్తి, సీఎంఆర్ అప్పగింతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. అయితే వాస్తవంగా మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నాయా? లేక కార్యాలయాలకే పరిమితమై నివేదికలు సిద్ధమవుతు న్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే నిల్వలు, మిల్లింగ్ వివరాలకు ధ్రువీకరణ ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
రేషన్ బియ్యం మళ్లీ ప్రభుత్వానికేనా?
పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమ మార్గాల్లో మిల్లులకు చేరి, తిరిగి సీఎంఆర్ బియ్యంగా ప్రభుత్వానికి అప్పగిస్తున్నారన్న ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు వస్తున్నాయి. ఇదే నిజమైతే ప్రజాపంపిణీ వ్యవస్థకు, ప్రభుత్వ ధాన్యం సేకరణ విధానానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. రేషన్ బియ్యం సరఫరా, మిల్లుల నిల్వలు, సీఎంఆర్ అప్పగింతలపై సమగ్ర విచారణ చేపడితేనే ఈ

వ్యవహారంలోని వాస్తవాలు బయటపడతాయి. ముడుపుల ఆరోపణలపై మౌనం ఎందుకు?మిల్లుల తనిఖీలు, నిల్వల ధ్రువీకరణ, సీఎంఆర్ అప్పగింతల విషయంలో కొందరు అధికారులపై ముడుపులు స్వీకరిస్తున్నా రన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ప్రభుత్వ విధులను నిర్వహించాల్సిన అధికారులు అక్రమాలకు సహకరిస్తున్నారనే ప్రచారం శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వాస్తవాలను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉంది. విజిలెన్స్ రంగంలోకి దిగేనా? జిల్లాలోని రైస్ మిల్లులన్నింటిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రికార్డుల్లోని నిల్వలకు క్షేత్రస్థాయి నిల్వలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. ధాన్యం సేకరణ నుంచి మిల్లింగ్, బియ్యం అప్పగింత వరకు ప్రతి దశను పరిశీలించాలి. అవసరమైతే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ప్రత్యేక విచారణ జరిపించాలి. ప్రభుత్వ ధాన్యం, ప్రజాధనం, పేదల రేషన్ బియ్యానికి సంబంధించిన వ్యవహారంలో అక్రమాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేవలం నివేదికలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో నిజానిజాలు వెలికితీసినప్పుడే పౌరసరఫరాల శాఖలో పారదర్శకతకు నిదర్శనం నిలుస్తుంది.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి



వెల్దండ నవంబర్ 1 (వు దయం) మండలంలోని చౌదర్‌పల్లి, లింగారెడ్డి పల్లి,గ్రామ పంచాయతీలో మహబూబ్‌నగర్ రంగారెడ్డి ,హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత అని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.పట్టభద్రులంతా చైతన్యవంతులై ప్రజా సమస్యలపై పోరాడే నాయకత్వానికి మద్దతుగా నిలవాలని, ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మండల భరసా పార్టీ అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమారు ,మాజీ ఎంపీటీసీ లు ఇస్లావత్ నాగులు నాయక్,జంగిలి జ్యోతి నిరంజన్,సింగిల్ విండో డైరెక్టర్ మొక్తల శేఖర్,మాజీ సర్పంచ్ లు వెంకట్ రెడ్డి,బాలక్ష్మయ్య, అంజి నాయక్, సురేందర్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్,దీజ సెల్ అధ్యక్షులు నర్సింహా,రాజ సెల్ అధ్యక్షులు నాగయ్య,ఉప సర్పంచ్ లు ,మెండె కొండల్ యాదవ్,బాలయ్య గౌడ్,రాజీవ్,గ్రామ కమిటీ అధ్యక్షులు తిరువతయ్య, వార్డు సభ్యులు,నునీత ఆనంద్,బాలు, మల్లేష్,గోఎల్,అశోక్,నాయకులు డీలర్ వెంకటయ్య,అంజి మాస్టర్,అశోక్, బాబురావు,భాస్కర్, భరత్, శేఖర్ రెడ్డి,రాజు,ఒగ్గు వెంకటయ్య, నర్సింహా, రాజేందర్,ప్రవీణ్,గిరి, నర్సింహా,మల్లేష్ సెట్,భీమయ్య,ప్రభాకర్, మహేష్, రామచంద్ర య్య,శ్రీను,పోచయ్య,రాజేందర్ ప్రసాద్, అశోక్,రామాదాసు,సాయిలు,నాగయ్య,ఒగ్గు బాల రాజ్,శ్రీను, సైదయ్య,దశరత్,భాస్కర్,రవి,ప్రసాద్,బాలు నాయక్,నగేష్,బర?

జన హృదయ విజేత.. సేవకే సరికొత్త నిర్వచనం!

దవులు జన్మదిన వేడుకల్లో వెల్లువెత్తిన అభిమానం
దద్దరిల్లిన గద్వాల.. ఘనంగా విష్ణుప్రియ హోటల్ అధినేత బర్త్‌డే వేడుకలు



గద్వాల నవంబర్ 01 (వుదయం బ్యూరో) వ్యాపార రంగంలో తిరుగులేని ముద్ర వేస్తూనే, ప్రజా సేవే ఊపిరిగా జీవిస్తున్న నిసలైన నాయకత్వ పటిమకు నిలువెత్తు రూపం 'విష్ణుప్రియ హోటల్' అధినేత దవులు. ఆయన జన్మదిన వేడుకలు గద్వాల పట్టణంలో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణాన్ని తలపిస్తూ జరిగాయి. జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపార ప్రముఖులు వేలాదిమంది అభిమానుల కోలాహలంతో వేడుక ప్రాంగణం దద్దరిల్లింది. ?అన్యాయంపై సమరభేరి.. ఆపదలో అభయహస్తం!


ఈ సందర్భంగా నాయకులు ఉద్వేగభ రితంగా మాట్లాడుతూ--- దవులు కేవలం ఒక వ్యాపారవేత్త మాత్రమే కాదని, ప్రజల కష్టాల్లో కొండంత అండగా నిలిచే ధైర్యమని కొనియాడారు. గద్వాల గడ్డపై ఎక్కడ సమస్య తలెత్తినా, ఎవరికి ఆపద ఎదురైనా సింహంలా ముందుకొచ్చి నిలబడే ధీరత్వం ఆయన సొంతమని స్పష్టం చేశారు. బాధితుల తరపున గళమెత్తడంలోనూ, ప్రజా సమస్యలపై పాలకులను ప్రశ్నించడంలోనూ ఎన్నడూ వెనకడుగు వేయని నిజాయితీ పరుడని కొనియాడారు.?అధికార గర్వం లేని ఆత్మీయత.. తెగని అనుబంధం! హోదాలు, స్థాయిలతో నిమిత్తం లేకుండా సామాన్యుడిని సైతం గుండెలకు హత్తుకునే నిష్కల్మషమైన మనస్తత్వమే ఆయనను 'జన నాయకుడి'గా నిలిపిందని పేర్కొన్నారు. కల్లాకపటం తెలియని చిరునవ్వు, అడిగిన వెంటనే ఆదుకునే ఉదారతతో ఆయన సంపాదించుకున్న ప్రజాభిమానం అసాధారణమైనదని స్పష్టం చేశారు.?సేవే ఆయుధంగా, ప్రజాభిమానమే బలంతో ముందుకు సాగుతున్న దవులు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, ప్రజా సేవలో కొత్త చరిత్ర సృష్టించాలని నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు. ఆయన నిండు నూరేళ్ల పాటు ఆయురారోగ్యాలతో, విజయపథంలో దూసుకుపోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



తుడుకూర్తి లో ఉచిత దంత వైద్య శిబిరం

నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 1 (వుదయం ప్రతినిధి) : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కూచుకుళ్ళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుడుకూర్తి గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామంలోని కూచుకుళ్ళ కొండమ్మ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్. కూచుకుళ్ళ సరితా రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య బృందం గ్రామస్థులకు దంత పరీక్షలు నిర్వహించింది.దంత సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు దంతాల సంరక్షణ, నోటి పరిశు భ్రతపై వైద్యులు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను ప్రజలకు చేరువ చేస్తున్న కూచుకుళ్ళ ఫౌండేషన్ కృషిని గ్రామస్థులు అభినందించారు.

బోరంచలో నూతన వస్త్రాధారణ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు పట్లోల సుధాకర్ రెడ్డి



వుదయం మనూరు నవంబర్: 1నారాయణాఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలం బోరంచ గ్రామం ఆప్తుడు మల్ప నర్సింహా రెడ్డి గారి సోదరుడి కుమారుడు కుమార్తె గార్ల నూతన వస్త్రాధారణ వేడుక వారి స్వగృహం బోరశీచ లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోల సుధాకర్ రెడ్డి. బోజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వారితో బీరప్ప సర్పంచ్,మల్లన్న పోచమ్మ మందిరం చేర్మెన్. బాణపురం రాజు ముదిరాజ్ కౌన్సిలర్. తదితరులు పాల్గొన్నారు

హకీం విశ్వప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మక మల్టిపుల్ అవార్డు

నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 01, (వుదయం ప్రతినిధి):

నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ సభ్యుడు హకీం విశ్వప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మక మల్టిపుల్ అవార్డు లభించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో నిర్వహించిన మల్టిపుల్ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. గత మల్టిపుల్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి, ప్రస్తుత మల్టిపుల్ చైర్మన్ అమర్‌నాథ్ రావు, ప్రస్తుత గవర్నర్ సురేష్ జగ్నాని చేతుల మీదుగా విశ్వప్రసాద్ అవార్డును స్వీకరించారు. గత ఏడాది డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన సమయంలో కొత్త లయన్స్ క్లబ్‌ల స్థాపనకు, పాత క్లబ్‌లలో నూతన సభ్యుల చేరికకు విశ్వప్రసాద్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు రాధాకృష్ణ, చెన్నకిషన్ రెడ్డి, హరినారాయణ్ బట్టడ్ తదితరులు పాల్గొని విశ్వప్రసాద్‌ను అభినందించారు. నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ సభ్యులు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నానని, అప్పటి నుంచి ప్రతి ఏడాది క్లబ్ అధ్యక్షులకు సహకరిస్తూ పలు సేవా కార్యక్రమాలకు తోడ్పడుతున్నానని తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నానని పేర్కొన్నారు. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, క్లబ్ అభివృద్ధికి భవిష్యత్తులోనూ కృషి చేస్తానని చెప్పారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ చౌక్‌లో కారు విధ్వంసం.. నిండు ప్రాణం బలి!

మృత్యువులా దూసుకొచ్చిన కారు.. కొబ్బరి బొండాల వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి బీభత్సం మరొకరి పరిస్థితి విషమం.. ప్రమాదంతో గద్వాలలో కలకలంగద్వాల టౌన్ నవంబర్ 01 (వుదయం బ్యూరో)



గద్వాల పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగానికి కళ్లెం లేకుండా దూసుకొచ్చిన కారు కొబ్బరి బొండాల లోడుతో వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మృతిచెందినట్లు సమాచారం. కారులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో అంబేడ్కర్ చౌక్ పరిసరాల్లో కలకలం రేగింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఢీకొన్న తీవ్రత, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రహదారులపై అతివేగం మరో ప్రాణాన్ని బలిగొందా? అనే ప్రశ్న ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చింది. ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసుల విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.

రామ్‌లీలా మైదానంలో 'ఓటు బచావో.. దేశ్ బచావో' నినాదం

ఢిల్లీ నిరసనలో పాల్గొన్న కోహీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ హుస్సేన్

కోహీర్, నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):



దేశంలో ఓటర్ల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణే లక్ష్యంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఓటు బచావో.. దేశ్ బచావో' నినాదంతో చేపట్టిన ఈ ఆందోళనలో ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కోహీర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ఢిల్లీకి వెళ్లారు.

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

ఇండియా కూటమి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కోహీర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఏఐసీసీకి చెందిన పలువురు జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం.

జాతీయ స్థాయి నిరసనలో కోహీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్గొనడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

బుర్గుమడ్లలో మామిడి రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు:

మామిడి తోటల పెంపకంలో రైతులు జాగ్రత్తలను పాటించండి
ఉద్యాన శాస్త్రవేత్త డా. రాజ్ కుమార్.

పర్వతగిరి , నవంబర్ 1 (వుదయం ప్రతినిధి): పర్వతగిరి మండలం బుర్గుమడ్ల గ్రామంలో వర్ధన్నపేట డివిజన్ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శనివారం మల్లారెడ్డి మామిడి క్షేత్రంలో రైతులకు ప్రత్యేక అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యాన శాస్త్రవేత్త డా. రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి తోటల పెంపకంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా 'ఎల్-నినో' (జుశ్రీ-చీఅఅశీ) వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడి రైతులు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని అధిగమించేందుకు చేపట్టవలసిన సాంకేతిక చర్యల గురించి దిశానిర్దేశం చేశారు. సకాలంలో ఎరువుల యాజమాన్యం, సరైన నీటి పారుదల పద్ధతులు మరియు కొమ్మల కత్తిరింపుల ప్రాతీబఅ-అఅస్త్ర) ప్రాముఖ్యతను రైతులకు సవివరంగా తెలియజేశారు.వర్ధన్నపేట ఉద్యానవన శాఖ అధికారి వేణు మాధవ్ మాట్లాడుతూ.. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. నాణ్యమైన దిగుబడి సాధించడానికి మరియు చీడపీడల నుండి పండ్లను రక్షించుకోవడానికి మామిడిలో తప్పనిసరిగా 'ఫ్రూట్ కవర్స్' వాడాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణ అధికారి రాజర్షి, ఫినోలెక్స్ డ్రిప్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ చిరంజీవి తో పాటు చుట్టుపక్కల వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చర్చిలో ఘనంగా వరల్డ్ సండే స్కూల్ డే వేడుకలు

వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

అచ్చంపేట,నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)వరల్డ్ సండే స్కూల్ డే సందర్భంగా అచ్చంపేట పట్టణంలోని చర్చిలో ప్రత్యేక వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సండే స్కూల్ కు చెందిన చిన్నారులు వివిధ బైబిల్ పాత్రలను ప్రతిబింబించేలా ప్రత్యేక వేషధారణలు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. యేసుక్రీస్తు బోధనలు, ప్రేమ, కరుణ, సేవాభావం, మానవత్వం వంటి విలువలను చిన్నారులకు తెలియజేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నారులు ప్రదర్శించిన వివిధ వేషధారణలు, కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ వేడుకల్లో చర్చి పాస్టర్ జయన్న, సండే స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సంఘ పెద్దలు పాల్గొని చిన్నారులను అభినందించారు. చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక విలువలు, నైతిక బోధనలు అలవర్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. చిన్నారుల ఉత్సాహం, పాల్గొన్న వారి ఆనందోత్సాహాల మధ్య వరల్డ్ సండే స్కూల్ డే వేడుకలు ఘనంగా ముగిశాయి.





ఈ కార్యక్రమంలో పాస్టర్ జయన్న, సంఘ పెద్దలు జేమ్స్, కరుణాకర్, భాస్కర్, ప్రభాకర్, అబ్షాలోము, చంద్రకాంత్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.
ళ16:30, 1/11/2026ఠి ూఎవంష్ఠ చీస్త్రనిశ్రీ: జుఅన

చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధాకరం

పీయూ విద్యార్థి నాయకుడు చక్కెర పవన్ కుమార్



చిన్నంబావి మండలం 01 వుదయం రిపోర్టర్చిన్నంబావి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని పాలమూరు యూనివర్సిటీ భారత రాష్ట్ర సమితి సీనియర్ విద్యార్థి నాయకులు చక్కెర పవన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి సొంత మండలమైన చిన్నంబావిని సైతం కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పంటలు చేతికందక రైతులు తీవ్ర ఆవేదనలో ఉంటే, ప్రభుత్వం కరువు పరిస్థితులను గుర్తించి సహాయక చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మండలంలోని రైతులు పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాల్లో కూరుకుపోతుంటే, మంత్రి తన నియోజకవర్గ రైతుల సమస్యలను పట్టించుకోవాలని, చిన్నంబావి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు పరిహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా వారి కష్టాలు పట్టించుకునే బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చి సాగునీరు కూడా తక్షణమే పంట పొలాలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందస్తు చర్యగా ప్రభుత్వం రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా 24 గంటల కరెంటు ఇవ్వాలి సాగునీరు అందుబాటులోకి తెచ్చి ఉంటే ఈరోజు రైతులు ఇంత పెద్ద మొత్తం నష్టపోయి ఉండేది కాదు అని సందర్భంగా అన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా సాగునీరుకు కరెంటు కు సక్రమంగా అందుబాటులోకి తీసుకురాలేక రైతులను నానా ఇబ్బందులు గురి చేస్తున్నారని రైతులకు ఈ కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది అని పియు చక్కెర పవన్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

శ్రీ గురు పీఠంలో ప్రత్యేక పూజలు....

శివ్వంపేట వుదయం నవంబర్ 01....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ ప్రియ శిష్యులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు పెద్దగౌని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు. దివ్య స్వరూపులు విశ్వంజీ మహారాజ్ ఆశీస్సులతో శ్రీ గురు పీఠం లో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి శిరిడి సాయిబాబా దేవతామూర్తుల యొక్క మందిరాలు నిర్మించడం ఆ దేవాలయాల్లో త్రిమూర్తుల అవతారుడైన దత్తాత్రేయ మహాస్వామి. సాక్షాత్తు శిరిడి శ్రీ సాయి బాబా ఈ దేవాలయాల్లో కొలువుదీరడం మహా అద్భుతం అని రెండు గుడుల మధ్య పంచవటి ఏర్పాటు చేయడం మరియు ప్రాముఖ్యత సంతరించుకుందని .ఈ దేవతామూర్తులకు ఆశ్వయుజ మాసం బహుళ సప్తమి తిథినాడు శ్రీ దత్తాత్రేయ స్వామిని ఆరాధించడం ఎంతో విశిష్టమైనది కావడంతో ఆదివారం పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి శ్రీ గురు పీఠం ప్రధాన అర్చకులు శాస్త్రుల నటరాజ్ శర్మ ఆధ్వర్యంలో దత్తాత్రేయ మహాస్వామికి షిరిడి సాయిబాబా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ భారత దేశంలోనే ఎక్కడా లేని విధంగా శ్రీ గురు పీఠంలో త్రిమూర్తుల అవతారాన్ని దత్తాత్రేయ మహాస్వామి భక్తులకు దర్శనమియడం. ఇక్కడే శిరిడి సాయిబాబా దేవాలయంలో శిరిడి లో సాయిబాబా ఎలా అయితే దర్శనమిస్తున్నారో అదే రూపంలో శ్రీ గురు పీఠంలో కొలువుదీరి భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం మహాద్భుతం అని వారు వర్ణించారు. ఇంతటి గొప్ప మందిరం గూడూరు లోని గురు పీఠంలో నిర్మితమవడం ఈ దేవత మూర్తులు ఒకే చోట పంచవటి దత్తాత్రేయ మహాస్వామి శిరిడి సాయిబాబా దేవతామూర్తులను భక్తులు దర్శనం చేసుకోవడం మహాభాగ్యమని వారు తెలిపారు. సాయిబాబా భక్తుడు మాట్లాడుతూ ఇక్కడికి రాకముందు నాకు ఎన్నో కష్టాలు ఉండేవని ఒకరోజు గూడూరులో శ్రీ గురు పీఠంలో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి మరియు షిరిడి సాయిబాబా వీధితోపాటు పంచవటి నిర్మితమై ఉన్నది అని తెలిసిన మరుసటి రోజు ఇక్కడికి వచ్చి భగవంతుని దర్శనం చేసుకొని కొద్దిసేపు కూర్చొని ధ్యానం





చేసుకోవడం జరిగింది. ఆ వారం రోజుల్లోనే నా కష్టాలు తొలగిపోయి నాకు ప్రశాంతత లభించింది నాటి నుండి నేను ఇక్కడికి వస్తున్నానని ఆయన తెలిపారు. భగవంతుని మనస్ఫూర్తిగా ధ్యానించినచో మన మొర ఆలకించి మన కోరుకున్న పలం లభిస్తుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టబద్రులందరూ నవంబర్ 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలి.

మీసేవ కేంద్రాల్లో గాని, పార్టీ ఏర్పాటు చేసిన ఆన్లైన్ కేంద్రం వద్ద ఓటును నమోదు చేసుకోవాలి.



వర్షతగిరి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు

పర్వతగిరి , నవంబర్ 1 (వుదయం ప్రతినిధి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం లోని పట్టభద్రులందరూ నవంబర్ 6 లోపు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు చేసుకోవాలని లేదంటే నవంబర్ 6 దాటితే ఓటు నమోదు చేసుకుని అవకాశం కోల్పోయి ఓటు వేసే అవకాశం పట్టభద్రులకు ఉండాలని పర్వతగిరి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులందరూ త్వరగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదును మీ సేవ కేంద్రం వద్ద గాని పార్టీ ఏర్పాటు చేసిన ఆన్లైన్ కేంద్రం వద్ద గాని ఆయా గ్రామాల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జిలకు ఆయా గ్రామాల పట్టభద్రులు ఓటుకు సంబంధించిన ధ్రువపత్రాలను అందజేస్తే వెంటనే పార్టీ ఏర్పాటు చేసిన ఆన్లైన్ కేంద్రం వద్ద ఉచితంగా ఓటు నమోదు చేస్తున్నట్లుబిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు తెలుపుతూ, నవంబర్ 6 లోపు మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలుపుతూ, పట్టభద్రులు త్వరగా ఓటు నమోదు చేసుకునే కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్సీ ఎన్నికల గ్రామ ఇంచార్జ్ లకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు.

ఓట్ బచావో.. దేశ్ బచావో నినాదంతో కాంగ్రెస్ ర్యాలీ...

రాయపర్తి నవంబర్ 1 (వుదయం ప్రతినిధి): రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి. అయూబ్, స్టేట్ కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మని శేఖర్ రావు, మాజీ టిపిసిసి కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, సామాజిక కార్యకర్త తక్కలపల్లి రవీందర్ రావు తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓట్ బచావో.. దేశ్ బచావో కార్యక్రమానికి సంఘీభావం ప్రకటిస్తూ ర్యాలీలో భాగస్వాములయ్యారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యత, దాని పరిరక్షణ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పార్టీ నాయకులు పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన



రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆందోళన పాల్గొన్న నల్లగొండ కాంగ్రెస్ నేతలు

నల్గొండ జిల్లా నవంబర్ 1 వుదయం ప్రతినిధి

నల్లగొండ జిల్లా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు నాయకులు ఢిల్లీకి చేరుకుని ఆందోళనలో భాగస్వాములయ్యారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల రక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ నిరసనలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

మధిర,నవంబర్ 1, వుదయం, ప్రతినిధి:

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మధిరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు అధ్యక్షతన మధిర రూరల్, మున్సిపాలిటీ, ఎర్రుపాలెం మండలాల ముఖ్య నాయకులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిలతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి నామ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీలోపు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేసి విజయవంతం చేయాలని సూచించారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి పిలుపును నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకొని క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని కోరారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగాలని, స్వల్ప తేడాతో విజయం చేజారినప్పటికీ ఏనుగుల రాకేష్ రెడ్డి ప్రజలకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల మధ్యే ఉంటున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆయనకు అండగా నిలవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ రాష్ట్రంలో కమిషన్లు, అవినీతి వ్యవహారాలు పెరిగిపోయాయని, ప్రజల ఆస్తులు, సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లాలో మంత్రుల ద్వారా జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పల్లెలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందాయని, విద్యుత్, తాగునీరు, సాగునీటి రంగాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అనేక చర్యలు చేపట్టారని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు, కార్యకర్తలు నిరంతరం స్పందిస్తూ



వారికి అండగా నిలవాలని సూచించారు. యువత, సీనియర్ నాయకులు పరస్పర సమన్వయంతో ఒకే టీమ్‌గా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుతో పాటు మధిర నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మధిర రూరల్, మున్సిపాలిటీ, ఎర్రుపాలెం మండలాల కోఆర్డినేటర్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు బాధ్యులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మధిర మండల అధ్యక్ష కార్యదర్శులుగా బండారు నాగరాజు, కార్యదర్శిగా ఈ వీరయ్య

మధిర, నవంబర్ 1, వుదయం, ప్రతినిధి:



టీఎస్ యూటీఎఫ్ మధిర మండల 13వ మహాసభ సందర్భంగా 2026,2027 సంవత్సరానికి సంబంధించి నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధిరలోని టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి, మధిర మండల ఇన్‌చార్జి షేక్ నాగూర్ వలి, ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ ఏ. వినోదరావు, కోశాధికారి మహమ్మద్ రఫీ పర్యవేక్షకులుగా వ్యవహరించగా, జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా బండారు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈ. వీరయ్య, ఉపాధ్యక్షులుగా కాజా సునీత, పఠాన్ బాజీ ఖాన్, కోశాధికారిగా బైర్ల చెన్నయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా జీబీఎంఎస్ రాణి, షేక్ లాల్ అహ్మద్, ఎ. కొండలరావు, చేదె రాణి, ఎం. రాజు, ఎల్. నాగేశ్వరరావు, బొబ్బిళ్లపాటి రమేష్‌బాబు, జి. విజయలక్ష్మి ,డి. కవిత, ఎస్. గోపిచంద్ ఎన్నిక కాగా, ఆడిటర్‌గా డి. మహేంద్ర కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ పరిరక్షణకు, సంఘ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని మహాసభలో నాయకులు ఆకాంక్షించారు.

రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాలయం



వెల్ఫేర్ అసోసియేషన్ భవనానికి శంకుస్థాపన చేసిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట, నవంబర్ 01: వుదయం ప్రతినిధి

పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లపాటు సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ కోమటికుంటకు వెళ్లే మార్గంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పదవీ విరమణ పొందినప్పటికీ పోలీసుల మధ్య ఉన్న అనుబంధం ఎప్పటికీ కొనసాగాలని, ఒకరికొకరు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి, అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కార్యదర్శి పి. పుల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, జిల్లా పోలీస్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, జనరల్ సెక్రటరీ వై. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

- మునగాల పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ
- నేలమర్రిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రచారం



మునగాల, నవంబర్ 2 (వుదయం):

రాబోయే నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మునగాల పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మునగాల మండల పరిధిలోని నేలమర్రి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నవంబర్ 6వ తేదీ వరకు మాత్రమే ఓటరు నమోదు గడువు ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా పట్టభద్రుల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, గత మూడేళ్లుగా కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు చేస్తూ పాలనను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పట్టభద్రులు బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కోళ్ల ఉపేందర్, గ్రామ సర్పంచ్ సుందరయ్య, నర్రా వెంకటరెడ్డి, రవీందర్ రెడ్డి, రాయ రవి, యుగంధర్, పలువురు వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణం పోయినా అవినీతి చేయను.. గట్టుప్పల్ ను అభివృద్ధి సాధించే వరకూ నిద్రపోను

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

గట్టుప్పల్,నవంబర్ 1(వుదయం):



మంచి పేరొస్తే శత్రువులు ఎక్కువవుతారని, మంచితనాన్ని ఓర్చుకోలేని దుస్థితి సమాజంలో ఉన్నదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో కురుమ సంఘానికి చెందిన శ్రీ బీరప్ప గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించి, ప్రాంగణంలో మొక్క నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ లక్షల కోట్ల అప్పుల వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో పడిందని, అందుకే నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలా కొట్లాడాల్సి వస్తోందని అన్నారు. నాటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి డిండి నీళ్లు తేలేకపోయారని, కనీసం గట్టుప్పల్‌ను మండలం కూడా చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. తన రాజీనామాతోనే గట్టుప్పల్ మండలం, చండూరు రెవెన్యూ డివిజన్ సాధించుకున్నామని గుర్తుచేశారు. బెల్ట్ షాపుల నిర్మూలన, ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా పేదలకు అండగా ఉంటున్నానని.. తన ప్రాణం పోయినా అవినీతికి తావివ్వనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం జాతీయ అధ్యక్షుడు కుండె వెంకటేశం, కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు శ్రీశైలం ,మండలం సర్పంచులు నామని జగన్నాథం , వెంకటేశ్వర్లు, స్వప్న రమేష్, రామయ్య, శ్రీను, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు .

నాడి చూసి వైద్యం చెయ్యండి.. నగదు చూసి కాదు



- డబ్బు కోసం కాదు.. సమాజ సేవ కోసమే వైద్య వృత్తి
- సీనియర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

చర్ల, నవంబర్ 1: (వుదయం ప్రతినిధి)

'వైద్యో నారాయణో హరిః' అనే నానుడికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, సేవాభారతి, వనవాసీ కళ్యాణ పరిషత్‌కు చెందిన వైద్య బృందం. వైద్య సేవలే పరమ ధర్మంగా భావిస్తూ, తమ వ్యక్తిగత పనులను, చదువులను పక్కనపెట్టి మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మూడు రోజులపాటు ఉచిత వైద్య సేవలందించి మానవత్వానికి మారుపేరుగా నిలిచారు. శ్రీ రామదాసు స్వాస్థ్య సేవా యాత్రలో భాగంగా సుమారు 20 మంది వైద్యులు, 80 మంది వైద్య విద్యార్థులు సంయుక్తంగా పది గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి దాదాపు 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గిరిజన గ్రామాల్లో రక్తహీనత, చర్మ, కిడ్నీ వ్యాధులు అధికం

వైద్య శిబిరాల సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత, చర్మ సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ముఖ్యంగా చిన్నారులు మట్టి, బలపాలు తినడం వల్ల రక్తహీనత సమస్యలు తలెత్తుతున్నాయని, దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవడం, పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంతో అవసరమని సూచించారు. గుడుంబా వంటి మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

రోగి నాడి చూడాలి.. నగదు కాదు!

ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య వృత్తి డబ్బు సంపాదన కోసం కాకుండా పేద ప్రజలకు సేవ చేయాలనే బాధ్యతతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. వైద్యులు రోగి నాడిని చూసి వైద్యం అందించాలే తప్ప వారి వద్ద ఉన్న నగదును చూసి కాదని హితవు పలికారు. స్టెతస్కోప్ రోగి గుండె చప్పుడును వినాలే తప్ప బ్యాంకు బ్యాలెన్స్‌ను కాదంటూ వైద్య వృత్తిలో మానవత్వం, సేవాభావం అత్యంత ముఖ్యమని చాటిచెప్పారు. తాను నిర్వహిస్తున్న ఆసుపత్రిలో పేద ప్రజలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తానని ప్రకటించారు. వైద్యం డబ్బు కోసం కాదు.. సమాజం కోసం చేయాలంటూ అక్కడున్న వారందరితో ప్రతిజ్ఞ చేయించారు.



పర్యావరణ పరిరక్షణ.. మత్తు పదార్థాల నిర్మూలనపై పిలుపు

ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ వస్తువులను వినియోగించాలని 'ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ ముద్దు' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో వినియోగిస్తున్న గడ్డి మందుల వల్ల నేల, పర్యావరణం, ప్రజారోగ్యంపై పడే దుష్ప్రభావాలపై రైతులకు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నషా ముక్త్ కార్యక్రమం స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారనే ఆందోళన వ్యక్తం చేస్తూ, డ్రగ్స్ దుష్పరిణామాలపై పాఠశాలలు, గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

గిరిజనుల ఆతిథ్యం మరువలేనిది.. మళ్లీ వస్తాం!

మూడు రోజులపాటు మారుమూల గిరిజన గ్రామాల్లో బస చేస్తూ వైద్య సేవలందించడం తమకు ఎంతో గొప్ప అనుభూతిని ఇచ్చిందని వైద్యులు తెలిపారు. గిరిజనుల ఆప్యాయత, ఆతిథ్యం, వారి జీవనశైలి తమ మనసులను హత్తుకున్నాయని, ముఖ్యంగా వారు రోట్లో దంచిన కారప్పొడి రుచిని ఎప్పటికీ మరువలేమని ఆనందంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని మారుమూల గ్రామాలను ఎంపిక చేసుకుని త్వరలోనే మరోసారి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

వారంలో ఒకరోజు పేదల కోసం ఉచిత వైద్యం

ఈ యాత్ర ద్వారా లభించిన అనుభవం తమలో మరింత సేవాభావాన్ని పెంపొందించిందని వైద్యులు, వైద్య విద్యార్థులు తెలిపారు. సమాజానికి మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షిస్తూ, వారంలో ఒకరోజు నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

ప్రస్తుత సమాజంలో వైద్యం వ్యాపార ధోరణిలో సాగుతున్న పరిస్థితుల్లో, తమ విలువైన సమయాన్ని వెచ్చించి, వ్యక్తిగత బాధ్యతలను పక్కనపెట్టి సుమారు 20 మంది వైద్యులు, 80 మంది వైద్య విద్యార్థులు మారుమూల గిరిజన ప్రాంతాలకు చేరుకుని నిస్వార్థంగా సేవలందించడం అభినందనీయమని చర్ల మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

'ఉంటావా.. పోతావా?

అక్రమ బెల్ట్‌షాపులపై చండూరు ఎస్ఐకి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కడక్ వార్నింగ్

చండూరు ,నవంబర్ 1(వుదయం):



చండూరు మండలంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్‌షాపులపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదల జీవితాలతో చెలగాటమాడుతున్న అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేస్తూ, చండూరు ఎస్ఐ శివకుమార్‌కు నేరుగా ఫోన్ చేసి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఎస్ఐకి ఫోన్ చేసిన ఎమ్మెల్యే.. "19 గ్రామ పంచాయతీలు ఉంటే పోలీసుల పేరు చెప్తే ఉచ్చ పడాలి... ఏం ఎస్ఐ నువ్వు.. ఉంటావా పోతావా?" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇక్కడ పని చేయాలంటే తన మొదటి కండిషన్ బెల్ట్ షాపుల కంట్రోల్ అని, అది చేయగలిగితేనే ఇక్కడ ఉండాలని, లేకపోతే ఇక్కడ పని చేయాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. గ్రామాల్లో అక్రమ మద్యాన్ని అరికట్టి శాంతిభద్రతలను కాపాడాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ఆయన ఎస్ఐకి వారం రోజుల డెడ్‌లైన్ విధించారు. "వారం రోజుల లోపల ఏ ఊర్లో ఎంతమంది దొంగ సారా అమ్ముతున్నారో విలేజ్ వారీగా ఆ 19 గ్రామాల లిస్ట్ తయారు చేసుకొని నా దగ్గరికి రా.. నువ్వేం మాట్లాడకు ఇక, అది ఎట్ల పని చేపియ్యాల్లో నేను చూసుకుంటా" అని ఆయన కఠినంగా ఆదేశించారు.

జవ్వాజి సామ్రాజ్యం పార్థివదేహానికి స్విమ్మర్స్ ఘన నివాళి

మధిర, నవంబర్ 1, వుదయం, ప్రతినిధి:



ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ యడ్లపల్లి శ్రీనివాసరావు అత్త,విశ్రాంత ప్రభుత్వప్రధానోపాధ్యాయురాలు జవ్వాజి నటరాజ కుమారి మాతృమూర్తి జవ్వాజి సామ్రాజ్యం పరమపదించడంతో మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.నివాళులర్పించిన వారిలో పల్లపోతు ప్రసాదరావు, లింగంపల్లి అప్పారావు,వేమూరి సునీల్,చెరుకూరి కృష్ణారావు, చల్లా సత్యనారాయణ, ఇన్‌స్టైల్ రాము,వందనపు శ్రీనివాసరావు, మైలవరపు వీరభద్రరావు,కందిమళ్ల సైదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వట్టికోట ఆశయాలు ఆదర్శనీయం

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జయంతి వేడుకలు
- గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ

నల్గొండ జిల్లా నవంబర్ 1 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో తెలంగాణ వైతాళికుడు, ప్రజా రచయిత, గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తిప్రదాత వట్టికోట ఆళ్వార్‌స్వామి జయంతి వేడుకలను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సమాజంలోని అన్యాయాలు, అసమానతలను తన రచనల ద్వారా ప్రశ్నించిన గొప్ప ప్రజా రచయిత వట్టికోట ఆళ్వార్‌స్వామి అని కొనియాడారు. సాహిత్యాన్ని సామాజిక చైతన్యానికి ఆయుధంగా మలిచి ప్రజల్లో అవగాహన కల్పించారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ప్రజల పక్షాన నిలిచి, పుస్తక పఠనం, గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన రచించిన 'ప్రజల మనిషి' నవల తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్‌రెడ్డి, కవులు మేరెడ్డి యాదగిరిరెడ్డి, పున్న అంజయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, కుసుమ శ్రీ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



గౌడ సంఘం కమిటీ అధ్యక్షుడిగా ఎల్లంకి యాదగిరి

మునుగోడు, నవంబర్ 01(వుదయం)

మునుగోడు మండల పరిధిలోని కొరటికల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ ఎల్లంకి యాదగిరి గౌడ సంఘం సొసైటీ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ. గౌడ కులస్తులందరికీ అండగా ఉంటానని అన్నారు,నన్ను అధ్యక్షులుగా ఎంపిక చేసిన గౌడ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో. ఉపాధ్యక్షులుగా అయితగొని సైదులు, నకరికంటి యాదగిరి కోశాధికారి,అయితగోని మల్లేష్,ఎల్లంకి యాదయ్య, అయితగొని యాదయ్య, వెంకన్న,నరసింహ, చంద్రయ్య, స్వామి,పల్లె లింగస్వామి,చేనగోని శ్రీను, తదితరులు,పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

మునగాల, నవంబర్ 2 (వుదయం):

మునగాల మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన చిటికెల మల్లమ్మ, వెంకన్న (లేట్) దంపతుల చిన్న కుమారుడు చిటికెల లింగరాజు, అనూషల వివాహ వేడుకల్లో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరే సురేందర్ రెడ్డి, కాపర్తి మణికంఠ, ఎస్.కె. సైదా, ఎస్.కె. జానీ తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల ప్రభుత్వ సేవకు ఘన వీడ్కోలు

- 40 ఏళ్ల పాటు అంకితభావంతో విధులు
- సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ ఆకునూరి లక్ష్మయ్య మట్టమ్మ



నల్గొండ జిల్లా నవంబర్ 1 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం విధులు నిర్వహించడం మాత్రమే కాదు ప్రజలకు సేవ చేయడం, బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం. ఈ స్ఫూర్తితో సుమారు నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో అంకితభావంతో పనిచేసిన భూగర్భ జల వనరుల శాఖ సూపరింటెండెంట్ ఆకునూరి లక్ష్మయ్య పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో వివిధ హోదాల్లో, వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ సహచర ఉద్యోగులు, ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రభుత్వ శాఖ అభివృద్ధికి, ప్రజలకు అందించే సేవలకు తనవంతు కృషి చేశారు. నాలుగు దశాబ్దాల పాటు కార్యాలయ విధులు, బాధ్యతలు, ప్రజా సేవలో నిమగ్నమైన ఆయన ప్రయాణం నేటితో ముగిసినా.. ఆయన అందించిన సేవలు సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలవనున్నాయి. ఉద్యోగ జీవితంలో ఎన్నో అనుభవాలను, అనుబంధాలను సంపాదించుకున్న లక్ష్మయ్య పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, సమాజానికి తన అనుభవాన్ని అందించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, సహచర ఉద్యోగులు, మిత్రులు పాల్గొని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కూడిన సంపూర్ణ జీవితం కలగాలని ఆకాంక్షిస్తూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమే.. సేవా స్ఫూర్తికి కాదు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా ప్రయాణంలో సంపాదించుకున్న గౌరవం, అభిమానమే ఆకునూరి లక్ష్మయ్యకు లభించిన అసలైన సంపద నగర బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్రావు కొండూరు సత్యనారాయణ కార్పొరేటర్లు కొందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, రావుల శ్రీనివాస్ రెడ్డి, జమాల్ ఖాద్రి, పెరిక కరణ్ జయరాజ్ యాట జయప్రద రెడ్డి, జిల్లా టీఎన్జీవో మాజీ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ తో పాటు పలువురు టీఎన్జీవో నాయకులు ఉద్యోగులు కుమారులు కోడండ్లు కూతుళ్లు అల్లుళ్లు మనుమండ్లు మనవరాళ్లు కుటుంబ సభ్యులు స్నేహితులు బంధుమిత్రులు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఓటును కాపాడుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

డివైఎఫ్ఐ 47వ ఆవిర్భావ దినోత్సవంలో యువతకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల పిలుపు



మునగాల, నవంబర్ 1 (వుదయం):

ఓటు హక్కును కాపాడుకుంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువత పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మునగాల మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర నాయకులు బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు యువత ముందుండాలని, ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి యువకుడిపై ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోయిళ్ల నవీన్, సానబోయిన ఉపేందర్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓటు చోరీకి వ్యతిరేకంగా యువత సంఘటితమై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఓటు చోరీ ఆరోపణలపై బాధ్యత వహిస్తూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు బచ్చలకూర సురేందర్, గద్దం వినోద్, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల ఉత్తేష్, మండల కమిటీ సభ్యులు బుర్రి సతీష్, నరసింహారావు, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఉచిత వైద్య సేవలు - మానవత్వం చాటిన ఓం ఆసుపత్రి

నిరాశ్రయులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున

సూర్యాపేట, నవంబర్ 01: వుదయం ప్రతినిధి



ఆదరణకు నోచుకోని నిరాశ్రయులను గుర్తించి వారి అనారోగ్య సమస్యలను నివారించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 42వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున అన్నారు.

ఆదివారం సూర్యాపేటలోని నిరాశ్రయుల కేంద్రంలో ఓం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అతుల్ రాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరాశ్రయుల కేంద్రంలో బాత్రూం, వంటగదుల్లో బండలు పగిలిపోయాయని, వర్షం వస్తే భవనం నీరు కారుతోందని, కిటికీలకు అద్దాలు లేకపోవడంతో దోమల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి నిరాశ్రయుల కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 70 మంది నిరాశ్రయులకు రక్తపోటు, షుగర్, కామెర్లు, జ్వరం, ఒంటి నొప్పులు, గజ్జి, తామర, గ్యాస్ తదితర సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ సంస్థ మేనేజర్ అనపర్తి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, రుద్రంగి రవి, మేనేజర్ సూరం రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పును ముందుగానే అంచనా వేసినీటి భద్రతకు జగిత్యాల జిల్లా సమగ్ర కార్యాచరణ

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- రానున్న 7–8 నెలల తాగునీటి అవసరాలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సమీక్ష

జగిత్యాల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)

వాతావరణ మార్పులు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు భూగర్భ జలాలపై పెరుగుతున్న ఒత్తిడి సాగునీరు తాగునీటి అవసరాలు వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లు విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలు..

వీటన్నింటినీ ముందుగానే అంచనా వేసి భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా జగిత్యాల జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోంది ప్రకృతి పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుతూ రానున్న యాసంగి సీజన్‌లో రైతులకు నష్టం వాటిల్లకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తోంది ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టగా జగిత్యాల జిల్లాలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి సంరక్షణ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు వివిధ శాఖలను సమన్వయం చేస్తూ కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టడం అందుబాటులో ఉన్న నీటి నిల్వలను సమర్థంగా వినియోగించడం భూగర్భ జలాలను పెంపొందించడం తాగునీటి భద్రతకు ముందస్తు ఏర్పాట్లు చేయడం నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించడం ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో శాశ్వత నీటి సంరక్షణ ఆస్తులను సృష్టించడం ఈ ప్రధాన లక్ష్యాలతో జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది

వర్షపాతం లోటు 9 శాతం.. ఐనా సాధారణ స్థాయిలోనే జిల్లా

జిల్లాలో ప్రస్తుత వర్షపాతం పరిస్థితులను పరిశీలిస్తే ఇప్పటివరకు 815.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది సాధారణ వర్షపాతం 896.7 మిల్లీమీటర్లతో పోలిస్తే ఇది 9 శాతం తక్కువ ఇప్పటివరకు 51 వర్షపు రోజులు నమోదయ్యాయి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ

ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జగిత్యాల జిల్లాలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు అక్టోబర్ 22న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో రానున్న 7 నుంచి 8 నెలల తాగునీటి భద్రత వ్యవసాయ ప్రణాళిక ప్రత్యామ్నాయ పంటల సాగు నీటి సంరక్షణ పనులపై సమగ్రంగా సమీక్షించారు మిషన్ భగీరథ ద్వారా వచ్చే జూన్ వరకు ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు .

ఎస్సారెస్పీలో 36 టీఎంసీల నీటి నిల్వ

జిల్లా నీటి భద్రతలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తోంది ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 36 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది ఈ నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి విడుదల తాగునీటి అవసరాలు భవిష్యత్తు వినియోగంపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు కాకతీయ ప్రధాన కాలువ ద్వారా అక్టోబర్ 10 నుంచి సుమారు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా దీని ద్వారా 18 మండలాలకు సాగునీరు అందుతోంది అదేవిధంగా ఫ్లడ్ ఫ్లో కాలువ ద్వారా అక్టోబర్ 14 నుంచి సుమారు 4,300 క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభమైంది ఈ కాలువ ద్వారా ఎనిమిది మండలాలకు నీరు అందుతోంది ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు అవసరమైన నీటిని అందించడంతో పాటు భవిష్యత్తులో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగునీటి వినియోగాన్ని క్రమబద్ధీకరించాల్సిన అవసరంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

920 చెరువుల్లో 63 శాతం చెరువులు 75 శాతానికి పైగా నిండి

జిల్లాలోని నీటి వనరుల పరిస్థితిని పరిశీలిస్తే మొత్తం 920 చెరువుల్లో 572 చెరువులు 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ నీటి నిల్వను కలిగి ఉన్నాయి ఇది మొత్తం చెరువుల్లో 63 శాతం మరో ఆరు చెరువుల్లో పూర్తి సామర్థ్యానికి మించి నీరు ఉండగా 148 చెరువుల్లో 50 శాతం కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నాయి అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అవసరాలకు అనుగుణంగా వినియోగించడంతో పాటు తక్కువ నీటి నిల్వలు ఉన్న చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు

ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా.. యాసంగిపై ముందస్తు ప్రణాళిక

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 4,20,908 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి ఇందులో 3,02,900 ఎకరాల్లో వరి సాగవుతుండగా మొత్తం సాగు విస్తీర్ణంలో వరి వాటా సుమారు 72 శాతంగా ఉంది మిగిలిన విస్తీర్ణంలో 38,900 ఎకరాల్లో మొక్కజొన్న, 3,700 ఎకరాల్లో పప్పుధాన్యాలు 5,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్ 800 ఎకరాల్లో సోయాబీన్ సాగవుతున్నాయి ఇతర పంటలు పండ్ల తోటలు అటవీ సంబంధిత సాగు కలిపి సుమారు 69,200 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి

భూగర్భ జలాలపై నిరంతర నిఘా

ఎల్‌నినో పరిస్థితుల్లో భూగర్భ జలాల లభ్యత అత్యంత కీలకంగా మారనుంది జిల్లాలో భూగర్భ జలాల స్థితిగతులను నిరంతరం పరిశీలిస్తూ భవిష్యత్తులో నీటి మట్టాలు ఎలా ఉండవచ్చనే అంచనాలను కూడా రూపొందిస్తున్నారు 2026 సెప్టెంబర్‌లో జిల్లాలో సగటు భూగర్భ జల మట్టం 3.65 మీటర్లుగా నమోదైంది. ఆగస్టుతో పోలిస్తే 0.82 మీటర్ల మేర నీటి మట్టం తగ్గినప్పటికీ 2025 సెప్టెంబర్‌తో పోలిస్తే 1.32 మీటర్ల మేర మెరుగైన స్థితిలో ఉంది అక్టోబర్ 2026లో సగటు భూగర్భ జల మట్టం 4.35 మీటర్లకు, నవంబర్‌లో 5.10 మీటర్లకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు మండలాల వారీగా పరిశీలిస్తే కోడిమ్యాల మండలంలో అత్యధికంగా 10.23 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి నవంబర్ నాటికి ఇది 10.78 మీటర్లకు చేరవచ్చని అంచనా బీర్పూర్ మండలంలో అత్యల్పంగా 2.01 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి

క్షేత్రస్థాయిలో కలెక్టర్ బి. సత్యప్రసాద్ కార్యాచరణ

మంత్రి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ నీటి సంరక్షణ పనుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు కలెక్టరేట్‌లో సమీక్షలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా ఫామ్ పాండ్లు ఇంకుడు గుంతలు బోర్‌వెల్ రీచార్జి నిర్మాణాలు మ్యాజిక్ సోక్ పిట్లు కమ్యూనిటీ సోక్‌పిట్లు డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్లు కాంటూరు కందకాలు స్టోన్ ట్రెంచెస్ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణను ప్రతి గ్రామంలో ప్రజా ఉద్యమంగా చేపట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు వర్షపు నీటిలో ప్రతి చుక్కను భూమిలోకి ఇంకేలా నిర్మాణాలు చేపట్టాలని రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు అదే విధంగా వరి పంటకు బదులుగా నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుని గ్రామాల్లో నీటి సంరక్షణకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సృష్టించాలని చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అధికారులను ఆదేశిస్తున్నారు

చేప పిల్లల విడుదలలోనూ నీటి లభ్యతే ప్రామాణికం

ఎల్‌నినో ప్రభావంతో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మత్స్యశాఖ కార్యక్రమాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు ఆయా చెరువులు కుంటల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు భవిష్యత్తులో నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే చేప పిల్లల విడుదల పరిమాణంపై నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు నీటి సామర్థ్యానికి మించి చేప పిల్లలను విడుదల చేయకుండా శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా చేపల మనుగడను కాపాడటంతో పాటు మత్స్యకారులకు ఆర్థిక నష్టం కలగకుండా చూడవచ్చు

తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ద్వారా గ్రామగ్రామాన ప్రజా చైతన్యం

ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలు ప్రజలకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు



సాధ్యమవుతాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఎల్‌నినో ప్రభావం నీటి సంరక్షణ విద్యుత్ పొదుపుపై ఆట పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వి శ్రీధర్ తెలంగాణ సాంస్కృతిక సారథి బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామాల్లో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలపై పలు సూచనలు అందించారు.

భవిష్యత్తు తరాలకు నీటి లభ్యతే అంతిమ లక్ష్యం

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ కలెక్టర్ బి సత్యప్రసాద్ క్షేత్రస్థాయి పర్యవేక్షణ వివిధ శాఖల సమన్వయం కలిసి జగిత్యాల జిల్లాలో నీటి భద్రతకు బాటలు వేస్తున్నాయి వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి నీటిని పొదుపుగా వినియోగించాలి భూగర్భ జలాలను పెంపొందించాలి రైతాంగానికి అండగా నిలవాలి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి గ్రామాల్లో ఉపాధి నీటి సంరక్షణ ఆస్తులను సృష్టించాలి భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను అందించాలి ఇదే సంకల్పంతో ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తూ ప్రజల భాగస్వామ్యంతో జగిత్యాల జిల్లా యంత్రాంగం సమగ్ర ముందస్తు కార్యాచరణను అమలు చేస్తోంది

ఎన్‌ఎంఎంఎస్ బరిలో ధర్యాపూర్ విద్యార్థుల సత్తా!

- 31 మంది విద్యార్థులు విజయవంతంగా పరీక్షకు హాజరు..
- ఎంపికపై పాఠశాల యాజమాన్యం ఆశాభావం



ముత్తారం, నవంబర్ 01(వుదయం ప్రతినిధి):

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అర్హత పరీక్షకు ఆదివారం ముత్తారం మండలం ధర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన 31 మంది విద్యార్థులు హాజరై విజయవంతంగా పరీక్ష రాశారు. వీరిలో 16 మంది బాలురు,15 మంది బాలికలు ఉన్నారు.పరీక్ష అనంతరం విద్యార్థులతో మాట్లాడిన పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ వారి పరీక్ష అనుభవాలను తెలుసుకొని,అందరూ ఎంపిక అవుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఫలితం ఎలా ఉన్నా నిరాశ చెందకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించిన మంథని ముత్తారం మండల విద్యాధికారి నలుమాసు హరి ప్రసాద్‌కు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పుస్తకాలు అందించిన దాతలు, సహకరించిన తల్లిదండ్రులకు ప్రధానాచార్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

చలో ఢిల్లీ

- ఓట్ బచావో – దేశ్ బచావో కార్యక్రమం
- జగిత్యాల నియోజకవర్గం నుండి భారీగా తరలిన కాంగ్రెస్ నేతలు



జగిత్యాల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)

ఓట్ బచావో – దేశ్ బచావో కార్యక్రమంలో పాల్గొనేందుకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలతో కలిసి ఢిల్లీకి చేరుకున్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటు హక్కు పవిత్రతను కాపాడటంఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను సాధించడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారని అన్నారు ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఓటు చోరీ ఓటర్ల జాబితాలో అక్రమాలు ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ డిల్లీలో చేస్తున్న పోరాటానికి మద్దతుగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య జగిత్యాల నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానేత లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయం

- 35వ వర్ధంతి సందర్బంగా నివాళులర్పించిన గ్రామస్తులు
- జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

మెట్‌పల్లి నవంబర్ 01 (వుదయం విలేకరి)





మూడు బొమ్మల మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఇబ్రహీంపట్నం మండల మాజీ ఉపాధ్యక్షులు అమరజీవి గడ్డం లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయమని గ్రామ ప్రముఖులు కొనియాడారు లక్ష్మారెడ్డి 35వ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామస్తులు నివాళులర్పించారు ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సర్పంచ్ గా మేడిపల్లి గ్రామాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని నిరంతరం ప్రజాసేవలో ఉంటూ మండల స్థాయి ప్రజాప్రతినిధిగా ఎదిగారని గుర్తు చేసుకున్నారు నేడు ఆయన జీవించి ఉంటే ఉన్నత రాజకీయ శిఖరాలను అధిరోహించేవారని నక్సలైట్ల చేతిలో ప్రాణాలు కోల్పోవడం గ్రామానికి ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు ఆయన ఆశయ సాధనకు యువత పునరంకితం కావాలని పిలుపునిచ్చారు వర్ధంతి సందర్భంగా గడ్డం లక్ష్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌జీవో సౌజన్యంతో స్థానిక మేడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో అడ్వకేట్ గడ్డం శంకర్ రెడ్డి గడ్డం దుర్గాప్రసాద్ రెడ్డి పీసు రాజేందర్ రెడ్డి అడ్వకేట్ గడ్డం ప్రశాంత్ రెడ్డితో పాటు పలువురు గ్రామ ప్రముఖులు యువకులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సన్మానం..



మల్లాపూర్ నవంబర్ 01 (వుదయం విలేకరి)

మల్లాపూర్ మండల ప్రెస్ క్లబ్ లో నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మల్లాపూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సభావాత్ మల్లేష్ ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షులు రామ్ చందర్ రెడ్డి కోశాధికారి అశోక్ రెడ్డి జిల్లా ఈసీ మెంబర్ రాజేష్ సంయుక్త కార్యదర్శి మాధుకర్ గౌరవాధ్యక్షులు ర్యాగల్ల వెంకటేశ్వర్లు గౌరవ సలహా దారు శేఖర్ శ్యాంను మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బూరం సంజీవ్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ ల ఆధ్వర్యంలో సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ ప్రెస్ క్లబ్ బలోపేతానికి ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని తోటి విలేకరుల కు ఆపదలో సహాయంగా నిలవాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ షేక్ సాజిద్ మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి పింజారి శివ కుమార్ మాజీ అధ్యక్షులు ఆగ సురేష్ కార్యవర్గ సభ్యులు కుర్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురు వ్యక్తుల గుర్తింపు

- మరో ఇద్దరి వద్ద పావు కిలో గంజాయి స్వాధీనం
- గంజాయి సేవించిన ఆరుగురిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు
- గంజాయి కలిగి ఉన్న ఇద్దరికి రిమాండ్

నవంబర్ 1 (వుదయం ప్రతినిధి)




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ సూచనల మేరకు దమ్మపేట పోలీసులు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తేదీ 31.10.2026న దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై బి. రాజేష్ కుమార్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అర్లపెంట గ్రామ శివారులోని స్మశాన వాటిక వద్ద గంజాయి సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ నిర్వహించిన యూరిన్ డ్రగ్ పరీక్షల్లో టిహెచ్సి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అనంతరం విచారణలో లంకాలపల్లికి చెందిన పొట్ట సాయికుమార్ @ సాయి, నాగుపల్లికి చెందిన లవుడియా చైతన్య వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి మొత్తం పావు కిలో గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12,500 ఉంటుందని తెలిపారు. ఈ కేసులో గంజాయి సేవించిన ఆరుగురిని, గంజాయితో పట్టుబడిన ఇద్దరిని దమ్మపేట కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు గంజాయి సేవించిన ఆరుగురిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించగా, గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించడం జరిగింది.గంజాయి సరఫరా, విక్రయాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వ మరియు వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాల్లేవు.. కుటుంబ పోషణ భారమైంది!

- ముత్తారం మండలంలోని మూడు గ్రామాల కాంట్రాక్ట్ పంచాయతీ కార్యదర్శుల ఆవేదన..
- వేతనాల కోసం ఎదురుచూపులు.. విధులు నిర్వహిస్తున్నా అందని జీతాలు
- పంచాయతీరాజ్ అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి

ముత్తారం నవంబర్ 01(వుదయం ప్రతినిధి):



ప్రభుత్వ గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సేవలందిస్తూ నిత్యం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ పంచాయతీ కార్యదర్శులకు వేతన కష్టాలు తప్పడం లేదు. ముత్తారం మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్యదర్శులు గత నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ, తమ శ్రమకు తగిన వేతనాలు సకాలంలో అందడం లేదని వాపోతున్నారు. ప్రతి నెలా కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు, నిత్యావసర సరుకుల కొనుగోలు వంటి బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందని, నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.

రవాణా ఖర్చులకూ ఇబ్బందులే!

గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించేందుకు ప్రతిరోజూ రాకపోకలు సాగించాల్సి ఉంటుందని,ఇందుకు రవాణా ఖర్చులతో పాటు ఇతర విధి నిర్వహణ ఖర్చులు కూడా ఉంటాయని కార్యదర్శులు పేర్కొంటున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు కుటుంబ బాధ్యతలు,మరోవైపు ఉద్యోగ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి తమను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతున్నారు.కాంట్రాక్ట్ పంచాయతీ కార్యదర్శులకు ప్రతి నెలా నిర్ణీత సమయంలో వేతనాలు చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగుల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ సమస్యపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ముత్తారం మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు భవిష్యత్తులో ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాల విషయంలో జాప్యం లేకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు ఆశిస్తున్నారు.



వెంకటేశ్వర దేవాలయ అధ్యక్షులు రెండవసారి ఎన్నికైన ఎతిరాజం నర్సయ్య

కోరుట్ల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో గల అధ్యక్షులమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షులుగా రెండవసారి చైర్మన్గా ఎన్నికైన ఎతిరాజం నర్సయ్య ను కాలువ గడ్డ మున్నూరు కాపు సంఘం సభ్యులు పూలమాల వేసి శాలువాతో ప్రతి సభ్యులు సన్మానించారు ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బండారి రాజేశ్వర్ అధ్యక్షులు బండి మహదేవ్ సెక్రెటరీ గుర్రాల శ్రీనివాస్ ట్రెజరర్ పుప్పల శ్రీనివాస్ సభ్యులు గుర్రాల రాములు నర్సయ్య వెంకటి కూడేల రాజేంద్రప్రసాద్ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు!

- ముత్తారంలో వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి
- అత్తే చంద్రమౌళి డిమాండ్

ముత్తారం నవంబర్ 01(వుదయం ప్రతినిధి):

మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీపీ,లక్కారం గ్రామ సర్పంచ్ అత్తే చంద్రమౌళి ఆదివారం డిమాండ్ చేశారు.ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన వరి పంటకు విద్యుత్ కోతల కారణంగా ఆశించిన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పంట దిగుబడి తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల పరిస్థితిని దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు.మండలంలోని వివిధ గ్రామాల్లో ఒక్కో ధర నిర్ణయిస్తూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని,రోజుకో ధర చెబుతూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు రైతులకు బోనస్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేయకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని,రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అత్తే చంద్రమౌళి ప్రభుత్వాన్ని కోరారు.

20వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- వైద్య సేవలకు ఆటంకం.. రోగులకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ జిల్లా నవంబర్ 1 వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఎన్ హెచ్ ఉద్యోగులు 20 రోజు నిరవధిక సమ్మె దీక్షలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 20వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా ఉద్యోగులు విధులకు దూరంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు చాలాకాలంగా వైద్య ఆరోగ్య శాఖలో కీలక సేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలు అందించడంతో పాటు టీకాల కార్యక్రమాలు, రోగ నిర్ధారణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో వీరి పాత్ర ఎంతో కీలకం. అలాంటి ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో ప్రజారోగ్య సేవలపై ప్రభావం పడుతోంది.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లింపు, 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్, పీఆర్సీ అమలు వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోగుల ఇబ్బందులను గుర్తించాలి

ఉద్యోగుల సమ్మె కారణంగా ఇప్పటికే ప్రభుత్వ వైద్య సేవలపై ఆధారపడే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ వైద్య సేవల నుంచి వివిధ ఆరోగ్య కార్యక్రమాల వరకు ప్రభావం కనిపిస్తోంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడం ఒకవైపు, వైద్య సేవలు సక్రమంగా అందకపోవడం మరోవైపు ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలి

సమ్మె 20వ రోజుకు చేరుకున్నా సమస్యకు పరిష్కారం లభించకపోవడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్చలకు ఆహ్వానించాలి. వారి న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కార మార్గం చూపాలి. ఉద్యోగులను గౌరవప్రదంగా విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డాక్టర్ దయానంద్, అకౌంటెంట్ అసిస్టెంట్ కరుణాకర్, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, ల్యాబ్ టెక్నీషియన్ తరాల సురేష్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ గణేష్, ఎండీ ఖలీల్, డాక్టర్ టి.రవి, ఆడియాలజీ విభాగానికి చెందిన అనిల్, బోడుపల్లి రమేష్‌తోపాటు ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల స్ఫూర్తితో అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ వక్కవంతుల ప్రభాకర్ రావు
- కామ్రేడ్ పొట్ల రామనర్సయ్య 50వ వర్ధంతి సభ

మునగాల, నవంబర్ 2 (వుదయం):




నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల స్ఫూర్తితో అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ వక్కవంతుల ప్రభాకర్ రావు పిలుపునిచ్చారు. మునగాల మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పొట్ల రామనర్సయ్య 50వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్ రావు మాట్లాడుతూ భారత విప్లవోద్యమ చరిత్రలో నవంబర్ మాసానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, సమాజ మార్పు కోసం ఎంతోమంది విప్లవ వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి గ్రామానికి చెందిన పొట్ల రామనర్సయ్య మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించి, చిన్ననాటి నుంచే ప్రజా ఉద్యమాల ప్రభావంతో సామాజిక మార్పు కోసం ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని తెలిపారు. సీపీఐ (ఎంఎల్) ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న క్రమంలో కొందరు ద్రోహులు అందించిన సమాచారంతో హైదరాబాద్‌లోని మలక్‌పేట ప్రాంతంలో ఆయనతో పాటు జానకిరామ్ రెడ్డి, డాక్టర్ నారాయణ, శ్రీపాద శ్రీహరిని పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. అనంతరం వరంగల్ జిల్లా నర్సంపేట తాలూకాలోని చిలకలగుట్ట అడవుల్లో నాటి వెంగళరావు ప్రభుత్వ హయాంలో పోలీసు బలగాలు కాల్చిచంపాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి ధరావత్ రవి, నాయకులు పొన్నం బ్రహ్మం, బూరగొమ్ముల కోటయ్య, డి. సైదా, గడ్డం యలమంచి, తెలిబోయిన బిక్షం, ధరావత్ పాండు, గడ్డం వినయ్, గోపమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసు పునఃప్రారంభానికి కృషి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు,నవంబర్01(వుదయంప్రతినిధి)



రామడుగు,మండలంలోనిగోలిరామయ్యపల్లి గ్రామ ప్రజలు, విద్యార్థుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామ ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసు పునఃప్రారంభానికి కృషి చేశారు.ఆదివారం రోజున గోలిరామయ్యపల్లి గ్రామానికి చేరుకున్న నూతన బస్సు సర్వీసును గ్రామ సర్పంచ్ నునుగొండ అంజలి జెండా ఊపి లాంఛనంగాప్రారంభించారు.బస్సు కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి బయలుదేరి కొక్కెరకుంట, మోతె, గోలిరామయ్యపల్లి, కొరటపల్లి, షానగర్ గ్రామాల మీదుగా రామడుగు మండల కేంద్రానికి చేరుకొని, అక్కడి నుంచి గోపాల్‌రావుపేట గ్రామం వరకు కొనసాగనుంది.గతంలో సరైన బస్సు సౌకర్యం లేక గ్రామ ప్రజలు,ముఖ్యంగాపాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. బస్సు సర్వీసు పునఃప్రారంభంతో విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, కరీంనగర్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు ఎంతోప్రయోజనంచేకూరనుంది సర్పంచ్ నునుగొండఅంజలిమాట్లాడుతూ.. గ్రామ ప్రజల చిరకాల కోరికనుగుర్తించిఆర్టీసీ అధికారులతోమాట్లాడి బస్సు సౌకర్యం పునరుద్ధరణకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దావా అనంతరెడ్డి, గుమ్మడి మల్లేశం, మొయిజ్ గ్రామ ప్రజలు, యువకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో నడిస్తే ధర్మమే మనల్ని రక్షిస్తుంది

- ధన్వాడ, మంథనిలో గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ప్రవచనం
- స్వామి వారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉంటాయి
- మంథని ప్రాంతంలో స్వామివారు అడుగుపెట్టడం గొప్ప అదృష్టం
- రెండుమూడేళ్ల నిరీక్షణ ఫలించింది
- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు





జయశంకర్ భూపాలపల్లి :నవంబర్ 01(వుదయం జిల్లా ప్రతినిధి)

భగవంతుడు సర్వాంతర్యామి. అనేక రూపాలు కోటానుకోట్ల పేర్లు. ఏ విధంగా స్మరించినా భక్తులకు కనిపించి,వారి కోరికలు తీరుస్తారని అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. అయితే ఆ కోరికలు నిస్వార్థమైనవిగా,సహేతుకమైనవిగా ఉండాలని ప్రవచించారు.ఆదివారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు ధన్వాడ, మంథనిలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులను ఉద్దేశించి స్వామీజీ ప్రసంగించారు.భగవంతుడిని నిస్వార్థంగా స్మరిస్తూ, ధర్మాన్ని ఆచరిస్తే జీవితంలో విజయం సాధించవచ్చని, మానవసేవే మాధవసేవగా భావించి అహింసా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు ఆదివారం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ విచ్చేశారు.హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో చేరుకున్న స్వామీజీకి మంత్రి శ్రీధర్‌బాబు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికి, తోడ్కొని వచ్చారు. అనంతరం మంత్రి నివాసానికి చేరుకున్న స్వామీజీ, ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో లోకకల్యాణార్థం నిర్వహించిన మహాపూర్ణాహుతి యజ్ఞంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులను ఉద్దేశించి దివ్య ప్రవచనం చేశారు.

భగవంతుడికి జయం అక్కర్లేదు..

భక్తులకు విజయాన్ని ప్రసాదిస్తారు భగవంతుడు ఎక్కడో లేడని, మన హృదయాల్లోనే కొలువై ఉంటాడని స్వామీజీ పేర్కొన్నారు. మనం భగవంతుడిని పూలతో పూజించి, నైవేద్యం సమర్పిస్తామని, భక్తితో సమర్పించిన నైవేద్యాన్ని భగవంతుడు సూక్ష్మరూపంలో ఆరగిస్తారని వివరించారు. భగవంతుడికి జయం అవసరం లేదని, ఆయనను విశ్వసించే భక్తులకు విజయాన్ని అందిస్తారని అన్నారు. భగవంతుడిని కుటుంబ సభ్యుడిగా భావించి, మనస్ఫూర్తిగా ఆరాధించాలని సూచించారు. కోరికలు కోరడంలోనూ నిస్వార్థం, సహేతుకత ఉండాలని హితవు పలికారు. మనిషి ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా భగవంతునిపై విశ్వాసాన్ని కోల్పోకూడదని, ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని చెప్పారు.భగవంతుడి మహిమను వివరిస్తూ బ్రిటిష్ పాలన కాలంలో తిరుపతిలో జరిగిన ఒక కథను స్వామీజీ భక్తులకు వివరించారు.అప్పట్లో తిరుమల శ్రీవారికి నైవేద్యం సమర్పించే అర్చకులు, దేవుడికి సమర్పించిన నైవేద్యాన్ని వారే తింటున్నారని ఒక కలెక్టర్ అనుమానించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని నిరూపించాలనే సంకల్పంతో ప్రధాన అర్చకుడు, ఇతర అర్చకులతో కలిసి కలెక్టర్ సమక్షంలోనే నైవేద్యాన్ని సమర్పించారని చెప్పారు.

తెర లేకుండా పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యాన్ని కలెక్టర్ ముందు ఉంచగా, ముందుగా సమర్పించిన ఆహారానికి, తర్వాత తీసుకొచ్చిన నైవేద్యానికి తేడా కనిపించిందని వివరించారు.ఈ ఘటనతో భగవంతుడి మహిమను గుర్తించిన కలెక్టర్ అర్చకులను అభినందించారని స్వామీజీ పేర్కొన్నారు. ధన్వాడలో కార్యక్రమం అనంతరం స్వామీజీ రోడ్డు మార్గంలో మంథనికి చేరుకున్నారు. అక్కడి శివకిరణ్ గార్డెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు దర్శనమిచ్చి, వారిని ఉద్దేశించి ప్రసంగించారు. స్వామివారి రాకతో మంథని ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు.స్వామివారు మంథని, ధన్వాడ ప్రాంతంలో అడుగుపెట్టడంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భావోద్వేగంగా మాట్లాడారు స్వామివారి దర్శన భాగ్యం లభించాలంటే ఎన్నో ఏళ్లు నిరీక్షించాల్సి వస్తుంది. ఒక్క క్షణం, రెండు క్షణాలు స్వామివారి దివ్య ఆశీస్సులు పొందే అవకాశం లభించడం కూడా గొప్ప అదృష్టం.గత రెండు మూడేళ్లుగా మా అమ్మగారు జయశ్రీ, నా సతీమణి, కుటుంబ సభ్యులు స్వామివారు ఈ ప్రాంతానికి వచ్చి ప్రజలకు ఆశీర్వచనాలు అందించాలని కోరుకుంటున్నాం. ఇన్ని రోజుల నిరీక్షణకు నేడు ఫలితం దక్కింది అని పేర్కొన్నారు. ధన్వాడలో దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని స్థాపించుకున్న తర్వాత స్వామివారు అక్కడికి విచ్చేసి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనడం గొప్ప విశేషమని మంత్రి అన్నారు.ఈ ప్రాంత ప్రజలకు శుభాశీస్సులు ఆశీర్వచనాలు అందించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రముఖులు జిల్లా ఎస్పీ కలెక్టర్ ప్రజలు భక్తులు వేలాదిగా తరలి వచ్చి పాల్గొనడం అభినందనీయమన్నారు.

స్వామివారి పాదాలకు నమస్కరించి, మంథని ప్రజల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రజలు, ముఖ్యంగా మంథని, ధన్వాడ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల కష్టాలు తొలగిపోయి, అందరూ బాగుండాలని, ప్రశాంతంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

స్వామివారి దివ్య ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలకు మంచి జరుగుతుందని, ఎన్ని కష్టాలు ఎదురైనా దత్తాత్రేయ స్వామివారి ఆశీస్సులతో వాటిని అధిగమించగలమనే విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఎల్లప్పుడు మంథని ప్రాంతం పై స్వామివారి ఆశీస్సులు ఆశీర్వాదం ఉంటాయని మంత్రి తెలిపారు. స్వామి వారికి అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు, మంత్రి లక్ష్మణ్‌కుమార్ సతీమణి, జిల్లా కలెక్టర్ రామగుండం పోలీస్ కమిషనర్, స్థానిక ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ పైపులైన్ మరమ్మతులు

పనులను దగ్గరుండి పర్యవేక్షించిన చైర్‌పర్సన్ అనూష సతీష్



ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 1 :

ఆదిలాబాద్ పట్టణానికి తాగునీరు సరఫరా చేసే 600 ఎంఎం ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అర్ధరాత్రి దాటినా దగ్గరుండి పర్యవేక్షించారు. తెల్లవారుజామున 2 గంటల వరకు అక్కడే ఉండి పనుల పురోగతిని పరిశీలించారు. మరమ్మతులు పూర్తిచేసి తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో నీటి సరఫరాను పునరుద్ధరించగా, అధిక ఒత్తిడి కారణంగా టీ జాయింట్ వద్ద మరోసారి లీకేజీ ఏర్పడింది. దీంతో అధికారులు తిరిగి మరమ్మతులు ప్రారంభించారు. ఆదివారం కూడా పనులు కొనసాగించారు. శాశ్వత పరిష్కారంలో భాగంగా మరమ్మతులతోపాటు సిమెంట్ కాంక్రీట్ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణానికి నిర్మల్ నుంచి తాగునీరు సరఫరా అవుతోందని, విద్యుత్ అంతరాయాలు, సాంకేతిక సమస్యలతో సరఫరాలో ఆలస్యం జరిగే అవకాశం ఉందని చైర్‌పర్సన్ తెలిపారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు పొదుపుగా వినియోగించాలని సూచించారు. అవసరమైనంత నీటినే నిల్వ చేసుకోవాలని, కుళాయిలకు ట్యాపులు బిగించి వృథాను అరికట్టాలని, ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని కోరారు. మరమ్మతు పనుల్లో ఏఈ నవీన్ కుమార్, డీఈ సందీప్ కుమార్, ఈఈ అరుణ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా వారియర్

- చిన్నపెల్లి అజయ్ జన్మదిన వేడుకలు..
- ఘనంగా సత్కరించిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



పర్వతగిరి , నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా వారియర్ చిన్నపెల్లి అజయ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ అజయ్‌ను స్వయంగా శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం నిరంతరం సోషల్ మీడియా వేదికగా చురుకుగా వ్యవహరిస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో అజయ్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఉత్సాహాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించి, మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, రాజకీయంగా మంచి గుర్తింపు మరియు విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకలు మరియు అభినందన కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ సయ్యద్ మసూద్, మాజీ సొసైటీ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మరియు పలువురు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో హైటెన్షన్.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై వేటు..

నల్లపు దేవేందర్ బిఆర్ఎస్ పార్టీ నుండి బహిష్కరణ



పర్వతగిరి , నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండలం ఏనుగల్ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది! భారత రాష్ట్ర సమితి పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి, పార్టీకి వ్యతిరేకంగా తెర వెనుక కార్యకలాపాలకు పాల్పడుతున్న నల్లపు దేవేందర్‌పై గ్రామ శాఖ ఉక్కుపాదం మోపింది. పార్టీ శ్రేణుల నుంచి వస్తున్న ఫిర్యాదులు , పక్కా సమాచారం ఆధారంగా పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఆయనను బీఆర్ఎస్ పార్టీ నుండి అనూహ్య రీతిలో బహిష్కరించారు. ఈ రోజు ఆదివారం నుండి నల్లపు దేవేందర్‌కు భారత రాష్ట్ర సమితి పార్టీకి, పార్టీ కార్యకలాపాలకు ఎటువంటి సంబంధం లేదని ఏనుగల్ గ్రామం బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మసానీ వెంకట్ ఈ పత్రికా ప్రకటన ద్వారా కుండబద్దలు కొట్టారు. పార్టీకి ద్రోహం చేసే వారిని, క్రమశిక్షణ తప్పు వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులో ఆయన చేసే ఏ చర్యలకూ పార్టీ ఎలాంటి బాధ్యత వహించదని స్పష్టం చేశారు. ఈ సంచలన నిర్ణయం ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది!

ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించాలి

నెహ్రూనగర్‌లో ఇంటింటికీ తిరిగి అవగాహన



నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 01

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి అర్హుడైన పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలోని నెహ్రూనగర్‌లో నాయకులు ఇంటింటికీ తిరిగి అర్హులైన పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ, ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, బలోపేతంలో ప్రతి పట్టభద్రుడు భాగస్వామి కావాలని, అర్హులైన వారందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జులు గోనె యువరాజు, రాయిడి దుష్యంత్ రెడ్డి, 9వ వార్డు ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జులు నాడెం నాగేశ్వర్, బండారి సంతోష్, యువ నాయకులు బత్తిని వంశీ, సత్తు అశోక్, గోవర్ధన్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి టౌన్ వైస్ ప్రెసిడెంట్ గా జొర్రిగల బాల్ లింగం



కామారెడ్డి, నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):-

జాతీయ బిసి సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ ఆధ్వర్యంలో జొరిగల బాల్ లింగంని కామారెడ్డి పట్టణం వైస్ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగింది. బీసీ సామాజిక వర్గాన్ని ఉన్నత స్థాయిలో చైతన్యం చేయడానికి, అలాగే 60% పైగా జనాభా కలిగి ఉన్న బీసీ ప్రజల జనాభా ఎంతనో మన వాటా అంత మన ఓటు మనకి మన వాటా మనకి అనే నినాదం తో, రాజ్యాధికారా లక్ష్యంతో ముందుకెళ్లాలని అన్ని బీసీ కులాల నుండి చైతన్యవంతులు చేస్తూ విద్య, ఉద్యోగం, రాజకీయ, అన్ని రంగాల్లో , అన్ని విధాలుగా బిసి సామాజిక వర్గాన్ని ముందుకు తీసుకెళ్లాలని,రాజ్యాధికారం చేపట్టాలని అలాగే బీసీ రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉందని దాని కోసం నిరంతరం కృషి చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా జోరిగల బాల్ లింగం మాట్లాడుతూ.. నామీద ఎంతో నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు రావడానికి సహకరించిన రాష్ట్ర నాయకులు కామని సుదర్శన్, జిల్లా అధ్యక్షులు చింతల శంకర్, కామారెడ్డి టౌన్ అధ్యక్షులు భోగ చందన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని, తనకు ఇచ్చిన పదవి బాధ్యతలు క్రమశిక్షణతో నిర్వహిస్తానని, బీసీల చైతన్యం, ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామని సుదర్శన్ నేత, బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చింతల శంకర్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీ రాజేందర్, కామారెడ్డి టౌన్ అధ్యక్షులు భోగ చందన్, బీసీ నాయకులు శ్రీనివాస్, కామారెడ్డి 15 వర్డ్ ఇంచార్జీ గద్దె రాజు, 17 వార్డు క్యాతమ్ సతీష్, 21 వార్డు దేవునపల్లి రామచంద్రం, 46 వార్డు ఇంచార్జీ కమ్మరి శివరామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత పోస్టల్ ఎంప్లాయ్ వరంగల్ డివిజనల్ సెక్రటరీగా కల్లెడ పోస్ట్ మాస్టర్ బాల్నే రాజు ఎన్నిక

- గ్రామీణ తపాలా ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు,
- పోస్టల్ ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారానికై పోరాడతానని హామీ
- అఖిల భారత పోస్టల్ ఎంప్లాయ్ వరంగల్ డివిజనల్ సెక్రటరీ బాల్లే రాజు



పర్వతగిరి , నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):

అఖిల భారత పోస్టల్ ఎంప్లాయ్ వరంగల్ డివిజనల్ సెక్రటరీగా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన పోస్ట్ మాస్టర్ బాల్నే రాజు ఎన్నికయ్యారు. వరంగల్ రీజినల్ స్థాయిలో నిర్వహించిన సమావేశంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మహమూద్ ఖాదర్,మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో బాల్నే రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన డివిజనల్ సెక్రటరీ బాల్నే రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘ నాయకులకు, సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు, పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాడతానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రూప్ సెక్రటరీ సీతారాం, నాయకులు అనిల్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. డివిజనల్ సెక్రటరీగా ఎన్నికైన బాల్నే రాజుకు పలువురు పోస్టల్ ఉద్యోగులు, స్థానికులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్ చే జాతీయ పురస్కారం అందుకున్న బాలు



రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ పురస్కారం

కామారెడ్డి, నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):-

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సమావేశంలో రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ పురస్కారం 2026 నికి గాను ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు ఉత్తర ప్రదేశ్ వృత్తి విద్యా, నైపుణ్య అభివృద్ధి శాఖ మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్, ఢిల్లీ బిజెపి ఏంఎల్ఏ తిలక్ రామ్ గుప్త, ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్, ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, బిజెపి సీనియర్ నాయకులు శ్యామ్ జాజు ల ద్వారా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ బాలు మాట్లాడుతూ.. 2007 నుండి రక్తదాన కార్యక్రమాల ద్వారా 30 వేల యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం తక్కువ సమయంలో 7000 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు గాను ఈ పురస్కారం అందుకున్నట్లు తెలియజేశారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి ఎంపిక చేయడానికి ఎంతగానో సహకరించిన గంజి రాజమౌళి గుప్త, ఉప్పల శ్రీనివాస్ గుప్త, సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు అనీల్ అగర్వాల్, జాతీయ కోశాధికారి దినేశ్ చాంద్ గుప్త, ఐవిఎఫ్ సెంట్రల్ కమిటీ సభ్యులు కక్కిరాల రమేశ్, నీల భైరయ్య లు పాల్గొన్నారు.

శ్రమదానం




రామడుగునవంబర్01(వుదయంప్రతినిధి)

కరీంనగర్ జిల్లారామడుగుమండలం వెలిచాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 21వ శ్రమదాన కార్యక్రమం అయ్యవారికుంట ఆంజనేయస్వామి ప్రకృతి వనంలో గుడ్డెలుగులపల్లి మున్నూరు కాపు సంఘం సభ్యులు శ్రమదానంచేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల నర్సింగరావు ఉప సర్పంచ్ వార్డు సభ్యులు మున్నూరు కాపుసంఘసభ్యులుపాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాంటెస్టెడ్ జెడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు రోళ్లకల్ , నారాయణ పురం సర్పంచులు లునవత్ దేవి - మంగ్య నాయక్, మూడు జంప నాయక్

పర్వతగిరి నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):



హైదరాబాద్‌లో నిర్వహించిన గృహప్రవేశ వేడుకల్లో పర్వతగిరి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నూతన గృహ యజమానులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాంటెస్టెడ్ జెడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు రోళ్లకల్ , నారాయణ పురం సర్పంచులు లునవత్ దేవి – మంగ్య నాయక్, మూడు జంప నాయక్, నారాయణపురం గ్రామ సర్పంచ్ జాంప నాయక్ సోదరుడి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రొల్లకల్, నారాయణపురం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సొసైటీ డైరెక్టర్ ఎర్రబెల్లి వెంకటేశ్వరరావు, గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు మోహన్ నాయక్, బీసీ సెల్ నాయకుడు నాగపురి లింగం, ఎస్సీ సెల్ మండల నాయకుడు బొట్ల వెంకన్న, పెద్దతండ గ్రామ శాఖ అధ్యక్షుడు మోహన్ నాయక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన గృహ యజమానులను శాలువాలతో సన్మానించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గృహప్రవేశ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి.



జర్నలిస్టు అకాల మృతికి ఘన నివాళి

దండేపల్లి: నవంబర్ 01 (వుదయం విలేఖరి)

లక్సెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో దండేపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో వీడియో జర్నలిస్టుగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పులిపాక శ్రీనివాస్ సంతాప సభను ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక జర్నలిస్టులు,ప్రెస్ క్లబ్ ప్రతినిధులు హాజరై శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని,వృత్తి పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బండి రవి గౌడ్, లక్సెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నిజాముద్దీన్ లు మాట్లాడుతూ పులిపాక శ్రీనివాస్ ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను,స్థానిక వార్తలను ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా నిబద్ధతతో ప్రజల ముందుకు తీసుకువచ్చారని కొనియాడారు.ఎంతో చురుగ్గా పనిచేసే శ్రీనివాస్ అకాల మృతి మీడియా రంగానికి,ముఖ్యంగా స్థానిక జర్నలిస్టు లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు, లక్సెటిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



సర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి

ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 01.

కేంద్రం ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓట్ల తొలగింపునకు పాల్పడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాస్తోందని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నర్సంపేట అంగడి సెంటర్‌లో ఎంసీపీఐ(యు) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జ్ఞానేష్ కుమార్ చిత్రపటాలను దగ్ధం చేశారు. పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ఓటర్ల తొలగింపు ద్వారా ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, నాగెల్లి కొమురయ్య, డాక్టర్ కోటేశ్వర్, కర్న సాంబయ్య, రాకేశ్, గణిపాక బిందు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మంజులకు 'సామాజిక న్యాయ వేదిక' ఆధ్వర్యంలో ఘన సన్మానం

- వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళలకే మా మద్దతు: సామాజిక న్యాయ వేదిక స్పష్టం
- ఘనంగా డాక్టర్ మంజుల జన్మదిన వేడుకలు




హనుమకొండ, నవంబర్ 01 (వుదయం ప్రతినిధి) :

హన్మకొండలోని రాంనగర్‌లో డాక్టర్ మంజుల జన్మదినాన్ని పురస్కరించుకుని సామాజిక న్యాయ వేదిక మరియు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామప్ప కళాశాల డైరెక్టర్ ఐలి చంద్రమోహన్ గౌడ్, సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్య యాదవ్, ప్రధాన సలహాదారులు కొమ్మినేని భూపాల్ రావు తదితరులు డాక్టర్ మంజులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు సాంబయ్య యాదవ్, ప్రధాన సలహాదారులు భూపాల్ రావు మాట్లాడుతూ... త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు ఏ పార్టీ టికెట్ కేటాయిస్తే, ఆ అభ్యర్థికి, ఆ పార్టీకే తమ 'సామాజిక న్యాయ వేదిక' పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

ఈ సన్మాన కార్యక్రమంలో వడ్డెర న్యాయ వేదిక జాతీయ అధ్యక్షులు అలకుంట్ల ఏళ్లన్న, పద్మశాలి న్యాయ వేదిక నాయకులు కందకట్ల కృష్ణ, మాల మహానాడు, మాదిగ న్యాయ వేదిక నాయకులు మాస బుచ్చయ్య, బాణాల ప్రభాకర్ రావు, సగర న్యాయ వేదిక నాయకులు నలువాల నర్సయ్య, రవీందర్, యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీ యాదవ్, ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణ, లంబాడీ న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా నాయక్, గౌడ న్యాయ వేదిక అధ్యక్షులు భిక్షపతి, విశ్వబ్రాహ్మణ న్యాయ వేదిక అధ్యక్షులు అకోజు పూర్ణచందర్ రావు, డాక్టర్ రాంలాల్, రజక న్యాయ వేదిక రాష్ట్ర నాయకులు శేఖర్, పలు కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలు పెడితే కారు స్పీడును తట్టుకోలేమనే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం

- ఓడిపోతామనే భయంతోనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించడం లేదు
- ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది
- 1400 ఎకరాలు కబ్జా చేశారంటూ తనపై నిరాధార ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి



జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 01 (వుదయం జిల్లా ప్రతినిధి):



రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పెడితే కారు స్పీడును తట్టుకోవడం చాలా కష్టం అవుతుందనే భయంతోనే రేవంత్ రెడ్డి ఎన్నికలు నిర్వహించడం లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు.ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ రామస్వామి నాయక్, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, మొగుళ్లపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యాలయం ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం వేదిక కావాలని ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో తనపై, కేసీఆర్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు అవాస్తవమని, వాటిపై తాను పరువు నష్టం దావా మరియు క్రిమినల్ కేసు కూడా పెట్టానని తెలిపారు. భూపాలపల్లిలో 1400 ఎకరాలు కబ్జా చేశారంటూ తనపై నిరాధార ఆరోపణలు చేశారని, ముఖ్యమంత్రి అయి మూడేండ్లు దాటినా ఆ భూములను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, పెన్షన్లు, కరెంట్, సాగునీటి విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. ఎన్నికలు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోతుందనే భయంతోనే జెడ్పీటీసీ ఎన్నికలను, కోఆపరేటివ్ ఎన్నికలను సకాలంలో నిర్వహించకుండా నామినేషన్ల పద్ధతికి మారుస్తోందని ఆరోపించారు.

అనంతరం మొగుళ్లపల్లి మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు దేవునూరి నరేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు దేవునూరి తిరుపతి, కుమార స్వామి, వెంగళ పవన్, దేవేందర్, వంశీ, చెక్క అభినయ్, చెక్క రాము, గుడిమల్ల గంగాధర్, దండు రాకేష్, దేవునూరి హరీష్, నీరటి రాకేష్, వనం సాగర్, చెక్క రాంచరణ్, సాంబరాజ్ యాదవ్, చాట్ల అజయ్, ఏ హరీష్, పుట్ట వెంకటేష్, దేవునూరి ప్రశాంత్ మరియు ములకలపల్లి గ్రామ సర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన యూత్ అధ్యక్షుడు అజయ్ కుమార్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సంపత్, సంతు, రమేష్, రాజు కుమార్, రాహుల్ తదితరులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కమిటీని రద్దు చేసి, ఎన్నికలు నిర్వహించాలి

- టియుడబ్ల్యూజె (హెచ్-143)
- ప్రెస్ క్లబ్ కాలపరిమితి ముగిసి రెండేళ్లవుతున్నా ఎన్నికలు పెట్టకపోవడం అనైతికం: టియుడబ్ల్యూజె కీలక సమావేశం
- ప్రెస్ క్లబ్ బైలా కమిటీ తిరస్కరణ.. దశలవారీ ఉద్యమాలకు టియుడబ్ల్యూజె పిలుపు



హనుమకొండ సిటీ,
నవంబర్ 01 (వుదయం ప్రతినిధి) :

హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె హెచ్-143) కీలక సమావేశం శనివారం ఘనంగా జరిగింది. యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతల సమక్షంలో ప్రెస్ క్లబ్ ఎన్నికలు మరియు జర్నలిస్టుల సమస్యలపై చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీని వెంటనే రద్దు చేసి, ఎన్నికల నిర్వహణకు అడ్వైజరీ కమిటీని ప్రకటించాలి. ప్రెస్ క్లబ్ కమిటీ కాలపరిమితి పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడం పట్ల సమావేశం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కాలయాపన చేసేందుకు తెచ్చిన కొత్త 'బైలా కమిటీ'ని తిరస్కరిస్తున్నాం. గతంలో పాత బైలా ద్వారానే ఎన్నికైన కమిటీ, ఇప్పుడు ఆ బైలాను విస్మరించడం అనైతికం. బైలా కమిటీలో ప్రకటించిన తమ యూనియన్ నేతలు ఆ కమిటీ నుండి తప్పుకుంటున్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల విషయమై సోమవారం గ్రీవెన్స్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు.

ప్రెస్‌క్లబ్ ఎన్నికల పర్యవేక్షణకు రెండు జిల్లాల యూనియన్ నేతలతో కూడిన స్టీరింగ్ కమిటీని నియమించాలి. గతంలో ప్రెస్ క్లబ్ కమిటీలో గెలిచిన యూనియన్ సభ్యులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడమే కాకుండా, ఎన్నికల నిర్వహణ కోసం దశలవారీగా ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఆర్. లెనిన్, రాష్ట్ర కార్యదర్శి తడక రాజనారాయణ, డెస్క్ జర్నలిస్టుల కన్వీనర్ శంకేసి శంకర్ రావు, రాష్ట్ర నేతలు చిలుముల సుధాకర్, కక్కెర్ల అనిల్ కుమార్, పొగాకుల అశోక్, దొంతు నవీన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కాపురి సుధాకర్, కార్యదర్శి హర్షం రాజ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు భూరం ప్రశాంత్, తాళ్లపల్లి వేణుగోపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నవనీత్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్ కుమార్, బొడిగె శ్రీను, ఈసీ మెంబర్లు కమటం వేణు గోపాల్, శ్రీకాంత్, డిజిటల్ మీడియా నాయకులు అరెల్లి కిరణ్, నాగరాజు, కెమెరామెన్ సగం అధ్యక్షుడు చందు, బండి రవి, అమీర్, మునీర్, ఎస్. హరి, యుగేందర్, సంతోష్, విజయ్, ప్రభాకర్, అనిల్, కృష్ణ తదితర జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రి శ్రీధర్ బాబు అహర్నిశలు కృషి

మహాదేవపూర్, నవంబర్ 01 (వుదయం ప్రతినిధి):

మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని సూరారం గ్రామ సర్పంచ్ మేకల శంకరమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మడక ప్రతాప్ రెడ్డి తెలిపారు.ఆదివారం మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామంలో గ్రామానికి చెందిన ముల్కల మంగ అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.32,500 చెక్కును సర్పంచ్ శంకరమ్మ, మడక ప్రతాప్ రెడ్డి బాధితురాలికి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ముల్కల మంగ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోగా విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో కార్యాచరణ చేపడుతున్నారని అన్నారు.దానిలో భాగంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సూరారం గ్రామాభివృద్ధి కోసం, గ్రామాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు గ్రామ అభివృద్ధికి రూ.4 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మంత్రి



శ్రీధర్ బాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక ఇటీవల కాలంలో కొందరు మంత్రి శ్రీధర్ బాబు తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీను బాబుపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, వారు మా నాయకులపై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజా సంక్షేమం కోసం దుద్దిళ్ల కుటుంబం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.ఇప్పటికైనా చిల్లర ఆరోపణలు చేసేవారు తమ పద్ధతులను మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్ల మహేష్ రెడ్డి, నాగుల అశోక్ రెడ్డి, ముదురుకోళ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ లో ఓట్ బచావో.. దేశ్ బచావో నినాదంతో కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొన్న చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి

ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్

పర్వతగిరి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):



రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మన్నె బాబురావు, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, తనుగుండ్ల జోగిరెడ్డి , పోరెడ్డి మహేందర్ రెడ్డి , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తంగళ్లపల్లి తిరుపతి , సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు చల్ల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న నాయకులు చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి లు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో నినాదాలు చేసామని ప్రకటనలో తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యువ నాయకుడికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీస్సులు!

పర్వతగిరి ,
నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):



వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా వేదికగా నిరంతరం క్రియాశీలక పాత్ర పోషిస్తున్న పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బీ.ఆర్.ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా వారియర్ చిన్నపెల్లి అజయ్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నపెల్లి అజయ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి ఆయన సేవలను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కార్యక్రమాలు, నాయకుల సందేశాలు, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అజయ్ చూపిస్తున్న చొరవ, అంకితభావం, నిరంతర కృషి అభినందనీయమని కొనియాడారు. యువతలో పార్టీ పట్ల నిబద్ధత, నాయకత్వంపై విశ్వాసం, పార్టీ కోసం పనిచేయాలనే పట్టుదల కలిగిన అజయ్ లాంటి యువకులు పార్టీకి ఎంతో అవసరమని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పార్టీ కోసం ముందుండి పనిచేస్తూ, సోషల్ మీడియా వేదికగా పార్టీ గొంతుకను బలంగా వినిపిస్తున్న అజయ్ సేవలు భవిష్యత్తులో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఇదే పట్టుదల, క్రమశిక్షణ, ఉత్సాహంతో ముందుకు సాగుతూ రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజల్లో మంచి పేరు సంపాదించుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. తన కృషికి మాజీ మంత్రి స్థాయిలో గుర్తింపు, ఆప్యాయతతో కూడిన ఆశీస్సులు లభించడంతో చిన్నపెల్లి అజయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ అభినందనలు ఆయనలో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు పార్టీ కోసం మరింత అంకితభావంతో పనిచేయడానికి ప్రేరణగా నిలిచాయి.

దళితులపై అగ్రవర్ణాల దాడి.. నిందితులను రిమాండ్ చేయాలి

మాంకాల యాదగిరి, అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

చెన్నారావుపేట నవంబర్ 1. (వుదయం ప్రతినిధి)



ఈరోజు చెన్నారావుపేట మండలం లోని ఉప్పరపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు చెలపాక ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బందేల అరుణ్ కుమార్,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ నాయకులు సాధు నర్సింగరావు, బీసీ ఎస్సీ, ఎస్టీ జేఏసి చెన్నారావుపేట మండల నాయకుడు అలువాల శ్రీనివాస్ ముఖ్యఅతిదులుగా పాల్గొని బాధితులను పరామర్శించిన అనంతరం వీరు మాట్లాడుతూ ఇటీవల ఉప్పరపల్లి గ్రామంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీగా వస్తున్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మరి కొమ్మాలు మరియు అనుచరులు యధావిధిగా డప్పు చప్పులతో గ్రామ పెద్దలు చింతకింది అశోక్ ఇంటికి వెళ్లి వారిని తీసుకువస్తుండగా ఇదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన దొనకొండ కర్ణాకర్ రెడ్డి రెండేడ్ల శరత్, భరత్ రెడ్డి మరియు తాటికొండ రాకేష్, చింతకింది దినేష్ అను వీరు డప్పు చప్పుల్లో వాయిస్తున్న కొమ్మలు మరియు అనుచరులను కులం పేరుతో దూషిస్తూ గ్రామ ప్రజలు అందరి సమక్షంలో వారిపై భౌతిక దాడులు చేయడం జరిగింది ఇది పూర్తిగా ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని దీన్ని వీరు పూర్తిగా ఖండించారు అలాగే బాధితులు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా 23వ తారీకు వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పలు సెక్షన్లలో నమోదు కాగా నాటి నుండి నేటి వరకు నిందితులను ఇప్పటి వరకు రిమాండ్ చేయకపోవడం చాలా విచారణకరమని అలాగే నర్సంపేటకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే మాధవ రెడ్డి తన సొంత మండలమైన చెన్నారావుపేట మండలంలో ఇలా జరగడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం నాటి నుండి నేటి వరకు బాధితులను మాధవ రెడ్డి పరామర్శించకపోవడం శోచనీయమని స్వాతంత్రం సిద్ధించి 80 సంవత్సరాలు అవుతున్నప్పటికీ దళితులపై వివిధ రకాల వివక్షతలు జరుగుతూనే ఉన్నాయని వీటిని రూపుమాపడానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఉప్పరపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక విధంగా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న నిందితులను ఇప్పటివరకు రిమాండ్ చేయకపోవడం అనేది చాలా దుర్మార్గమైన విషయం. ఏది ఏమైనప్పటికీ నర్సంపేట చిన్న రావుపేట పోలీసు ఉన్నతాధికారులకు అలాగే ఎమ్మెల్యే మాధవ రెడ్డి గారికి విజ్ఞప్తి 48 గంటల్లోగా నిందితులను తక్షణమే రిమాండ్ చేయాలి లేని యెడల బాధితుల పక్షాన కుల సంఘాలు ప్రజాసంఘాలు అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వ్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం చెన్నారావుపేట మండల అధ్యక్షుడు మంచాల హరీష్, ప్రధాన కార్యదర్శి మేకల చందు, మండల నాయకులు ఒంటరి రాములు,బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ చెన్నారావుపేట మండలం ఉపాధ్యక్షులు మంతెన బాబు, ప్రధాన కార్యదర్శి పసునూరి స్వామియేల్ నాయకులు చిలపాక రాకేష్ బొమ్మల రవీందర్ బరపట్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు

వరంగల్‌లో నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

14 రోజుల పాటు ప్రదర్శన. చేనేత ఉత్పత్తుల విక్రయాలు

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 01

చేనేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు, వారు తయారుచేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, ప్రజలకు నాణ్యమైన చేనేత వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వరంగల్‌లో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ, చేనేత మరియు జౌళి శాఖ తెలంగాణ ప్రభుత్వం, సహకార సంఘాలు, చేనేత శాఖ వరంగల్ వారి సహకారంతో ఈ ప్రదర్శనను నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు 14 రోజుల పాటు నిర్వహించనున్నారు. హనుమకొండలోని శ్రీ లక్ష్మీనగర్ కాలనీ, ఎన్‌జీఓస్ కాలనీ రోడ్డులో ఉన్న రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, చేనేత కార్మికులకు నిరంతర పని మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి ఉత్పత్తులకు తగిన గుర్తింపు తీసుకురావడం ప్రధాన లక్ష్యాలుగా నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, గద్వాల్, వెంకటగిరి, ఉప్పాడ, మంగళగిరి, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన చేనేత చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్‌షీట్లు, లుంగీలు, టవల్స్‌తో పాటు వివిధ రకాల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంటాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని జౌళి శాఖ, చేనేత మరియు జౌళి శాఖ తెలంగాణ ప్రభుత్వం కోరారు.

ఆదివారం కురిసిన వర్షం పంట పొలాలకు ఊరట పత్తి చేనులకు నష్టం

ఖానాపురం, నవంబర్ 1 (వుదయం ప్రతినిధి):

ఆదివారం సాయంత్రం సమయంలో కురిసిన వర్షంకు పంట పొలాకు ఊరట కలిగించిన పత్తి పంటలకు కొంత నష్టం వాటిలినట్లు రైతులు తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు సకాలంలో పడక రైతులు నానా ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం కొంతవరకు ఊరటని చ్చినట్లు రైతులు తెలిపారు.

ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి తనయుడు అవినాష్ రెడ్డి హల్‌చల్.. నూతన వధూవరులకు ఆశీస్సులు!

తాండూరు నవంబర్ 1 వుదయం ప్రతినిధి)

తాండూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన పలు వివాహ వేడుకల్లో తాండూరు శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి తనయుడు, యువనేత బుయ్యాని అవినాష్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పట్టణంలోని వివిధ ఫంక్షన్ హాళ్లలో జరిగిన శుభకార్యాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో దంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో తాండూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, తాండూర్ మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్రెడ్డి, కోట బాస్ పల్లి సర్పంచ్ సరూప వెంకటరామి రెడ్డి,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవినాష్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు. వారితో పాటు కాంగ్రెస్ నాయకులు రవీందర్ గౌడ్ ఎమ్మార్వో మహేష్ గౌడ్, రాజ శేఖర్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, రాసునం మల్ రెడ్డి, చెంగోల్ రాము యాదవ్, కౌన్సిలర్ దివిటి ఎల్లప్ప, పాల్గొన్నారు.

డాక్టర్ రామ నర్సయ్యకు రాష్ట్రస్థాయి మల్టిపుల్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

తొర్రూరు సెప్టెంబర్ 1 (వుదయం ప్రతినిధి):

లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందిన తొర్రూరు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామ నర్సయ్యకు రాష్ట్రస్థాయి మల్టిపుల్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని కొంపల్లి హోమ్స్ టమ్స్ కన్వెన్షన్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రముఖులు డాక్టర్ బాబురావు, సునీల్ కుమార్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గత ఏడాది తొర్రూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ రామ నర్సయ్య, పలు సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టి క్లబ్‌కు జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఆయన సేవలను గుర్తించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు జిల్లా, రీజియన్ స్థాయిల్లోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ అధ్యక్షుడిగా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ నర్సయ్య మాట్లాడుతూ, గత ఏడాది అధ్యక్షుడిగా తన బాధ్యతలను అంకితభావంతో నిర్వహించానని తెలిపారు. తాము చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్రస్థాయి మల్టిపుల్ అవార్డు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనతో పాటు తొర్రూరు లయన్స్ క్లబ్‌కు మరింత గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు. సంవత్సరం పొడవునా నిర్వహించిన సేవా కార్యక్రమాలకు సహకరించిన జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, తొర్రూరు లయన్స్ క్లబ్ ప్రముఖులు డాక్టర్ రాజేందర్ రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, ఇతర లయన్స్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీ దామర సరేస్, టి. వెంకట్ రెడ్డి, చిదిరాల నవీన్, ముడుపు రవీందర్ రెడ్డి, వజనపల్లి శ్రీనివాస్, బోనగిరి శంకర్, గోపాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవ చేస్తా : ప్రొఫెసర్ గడదాసు వెంకటేశ్వర్లు

అచ్చంపేట, నవంబర్ 1
(వుదయం ప్రతినిధి) :

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవ చేయడమే తన ధ్యేయమని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, నల్లమలవాసి గడదాసు వెంకటేశ్వర్లు అన్నారు.లింగాల గ్రామంలో ఏకల్ అభియాన్ విద్యాలయ పీపుల్స్ మూవ్‌మెంట్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరానికి హాజరైన రోగులను ఆప్యాయంగా పలకరించి ఆశీస్సులు అందించారు. పేద, సామాన్య ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రజలకు సేవ చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు.



ఈ కార్యక్రమంలో లింగాల గ్రామ ఉప సర్పంచ్ వీరస్వామి, గ్రామ పెద్దలు, ఏకల్ అభియాన్ విద్యాలయ పీపుల్స్ మూవ్‌మెంట్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



